
PJSA 118 B 100

నగ్నమోహిని & కాయగండం



3C

894.827132
R1--SAS
14563
24563

CS

శ్రీపురకోనిమధుసూదనరావు
22-9-87

Donated by
Sri T. Madhusudana Rao

ఈ వ్యవస్థ హృదయంగల హాయి
మనీ వేగంగా కూడూ గూడూ
గుడ్డా దొరికే సోషలిస్టు హాయీం
లోకి తమని తీసి కెడుతుందనీ అవూ
యకంగా నమ్మి ఈ కొయ్యి
గుర్రాన్ని కొలుస్తూ దీని రాజకీ
యపు ఇనపడెక్కల కింద నలుగుతూ
బానిసలుగా బతుకుతూ 1977
నవంబరు 19 న సాగరమెత్తిన జల
ఖడ్గం కింద ఊపిరి తెగిన అసం
ఖ్యాక అమాయక అభాగ్యులకి—

T

ACCNO : 9684

అట్టమీద కొయ్యగుర్రం :
శ్రీ మనోహన్ దత్
అచ్చు : నాట్యకళప్రెస్
మొదటి రెండువేల కాపీలు
ఖరీదు : 5/- లు

విముక్తి ప్రచురణ
సమర్పిస్తున్నది



కవిత

కొయ్యగుర్రం

కృతజ్ఞతా భారంతో

శ్రీ నికీతా గూరోవ్ —
లెనిన్‌గ్రాడ్ యూనివర్శిటీలో తెలుగు బోధిస్తున్నారు. మహెంజోదారో-హరప్పా లిపిరహస్య పరిశోధనకు సంబంధించిన సోవియట్ బృందంలో సభ్యులుగా వున్నారు. ద్రవిడ భాషీయుల జీవన విధానాల మూల స్వరూపాన్ని పునర్నిర్మించే ప్రయత్నం చేస్తున్నారు..

శ్రీ చేకూరి రామారావు—
ఉస్మానియా విశ్వవిద్యాలయం భాషాశాస్త్ర విభాగంలో ప్రొఫెసర్‌గా ఉన్నారు. తెలుగువాడి వాక్యపునాది పట్టుకున్న ప్రొ. రామారావుగారు 'కొయ్యగుర్రం' తెలుగు కవితకు రష్యన్ స్పందనను అక్షరరూపంలో (శ్రీ గూరోవ్ స్వదస్తూరీలో) మాకు తెప్పించి ఎంతో సాయం చేశారు.

'కొయ్యగుర్రం' మొదట 1977 చివర్లో హైదరాబాద్ ఆకాశవాణి నుండి ప్రసారమైంది. తర్వాత ప్రజాతంత్ర వారపత్రికలో అచ్చయింది.

బద్దకాన్ని పాతిపెట్టడంలో అప్పుడప్పుడూ బద్దకించినా— ముఖమ్మీద గుర్రాన్ని రచించినవారు శ్రీ మనోహన్ దత్.

ఈ పుస్తకం ఈ రూపంలో అత్యంత వేగంగాఆప్యాయతాభిమానాల్తో అచ్చులోకి తెచ్చినవారు శ్రీ టి. ప్రభాకర్ (నాట్యకళప్రెస్).

నగ్నముని కి తిరిగి కలం పట్టుకోవాలనే కోర్కె కలగడానికీ, రెండేళ్ల తర్వాతనైనా ఈ దీర్ఘకవిత పుస్తక రూపంలో బయటికి రావడానికీ– నిరుత్సాహపు కారుచీకట్లో ధైర్యపుకాగడాగా వెంటవుండి ప్రోత్సహించిన వారు శ్రీ బి. ఎర్రంరాజు.

నికితా గూరోవ్, ప్రొ. చేకూరి రామారావు, రావూరి భరద్వాజ, దేవీప్రియ, మనోహన్ దత్, ప్రభాకర్, ఎర్రంరాజుగార్లకూ—

అజ్ఞాతంగా అందదండలందజేసిన వారందరికీ దణ్ణాలు.

సంపాదకుడు

సృష్టి ప్రచురణ

హైదరాబాద్.

THE POETIC VISION OF NAGNAMUNI

నగ్నముని కవిత్వం తాజా పాలవలె ఇంపైనది కాదు, డాక్టరు ప్రిస్క్రైబ్ చేసిన మందువలె చేదుగా అప్పుడప్పుడు వుంటుంది. అతని కవితలు పాఠకులను ముద్దుచేస్తున్నవి కావు, లాలిస్తున్నవి కావు, అప్పుడప్పుడు బుగ్గలపై చరుపులు వేస్తున్నవి. అయితే, అతను రాసిన ఒక ముక్క ఒకసారి చదివితే మీరు దాన్ని మరచిపోలేరు. అది జ్ఞాపకంలోకి వచ్చి అక్కడ ఎన్నటికీ నిలిచి వుంటుంది.

నగ్నమునిగా సాహిత్యరంగంలోకి దాదాపు పదిహేనేళ్ళకిందట ఇతర దిగంబర కవులతో ప్రవేశించారు. వాళ్ళ కవిత్వంలో స్వాభావికంగా అంతర్భూతమైన గుణాపగుణాలు, పూర్వకాలపు సాంస్కృతిక పరంపర యొక్క సంపూర్ణమైన నిరాకరణ, "వామపక్షతత్వం అనే బాలారిష్టం" మొదలైనవి—అతని రచనల్లోనూ అప్పుడప్పుడు ప్రవేశించాయి అప్పటి నుంచి మన కవి సృష్టి ప్రజ్ఞ కాలగతితో కొంత వృద్ధి పొందింది. తన యౌవనకాలపు ఆదర్శములలోను సిద్ధాంతాలను అవశ్యమైన వాటిని పాటిస్తూ, ఉపేక్షమైన వాటిని తోసివేసి తాను ఎంచుకున్న తోవను సాగిస్తున్నాడు నగ్నముని.

ప్రతి కవికీ సహజంగా ఉండాల్సిన గుణాలలో అతి ముఖ్యమైనది ఒకటి—"కవిత్వాత్మకమైన దృష్టి" (poetic vision). మనలను

చుట్టుపున్న ప్రపంచంలో సాధారణ మానవుడు చూడని, చూడలేని వస్తువులను, లక్షణాలను, వాటికి వున్న సంబంధాలను కవి యొక్క సూక్ష్మదృష్టి కనుగొనగలదు, కనుగొనక తప్పదు. ఈ గుణము "నగ్నముని" అనే కవికి సంపూర్ణంగా ఉంది. నిజమైన కవులవలె, నగ్నముని తన రచనల్లో బాహ్య ప్రపంచాన్ని ప్రతిబింబిస్తూ, తన స్వాంత ప్రపంచం సృష్టిస్తున్నాడు. ఈ ప్రపంచం పై పైని చూపులో ఎంతో సంక్షిప్తమైనదిగాను, సంకీర్ణమైనదిగాను కనిపిస్తుంది. కాని, సావధానంగా చూస్తే ఈ ప్రపంచంలో ఏదో వెలుగు ప్రజ్వలిస్తు న్నట్లు కనిపించడం మొదలవుతుంది. ఈ వెలుగు- అంధకారంలో ఈ సూర్యకిరణం ఏమంటే - సామాన్య మానవుని పట్ల కవి హృదయంలో ఉన్న ప్రేమ, వాడి దుఃఖ విచారాల పట్ల అతని ప్రామాణికమైన సానుభూతి. వీటన్నిటికి చక్కని నిదర్శనం—నగ్నముని రచించిన "కొయ్యగుర్రం".

హైదరాబాద్ – 1978
లెనిన్ గ్రాడ్ – 1979

— నికీతా గూరోవ్

కొయ్యగుర్రం

ఆధునిక మహాకావ్యం

సుమారుగా 1950-60 మధ్య కాలంలో తెలుగుదేశంలో ఆధునిక భావ చైతన్యాన్ని ప్రతిబింబించిన ఒకే ఒక్క వారపత్రిక 'తెలుగు స్వతంత్ర'- 1954కు పూర్వం మద్రాసు నుంచి, ఆ తరువాత హైదరాబాదు నుంచి వచ్చేది. ఆ పత్రికకు ఒక అలవాటుండేది. వచ్చిన కవితల్లో ఒక పేజీలో సరిపోయే వాటిల్లో మంచిది ఎన్నుకుని విషయ సూచిక పక్కపేజీలో అచ్చేసే వారు. ఆ పత్రికలో పడ్డ కవితకి, మరీ ముఖ్యంగా, ఆ పేజీలో పడ్డదానికి తెలుగు పాఠక లోకంలో మంచి గుర్తింపు వుండేది. నిజాం కాలేజీలో బి. ఏ. చదువుతుండే కొంతమంది మిత్రులం 1956-58 మధ్యకాలం స్వతంత్రలో కవిత్వం చదువుతూ వాటి మంచి చెడ్డల గురించి హాస్టళ్ళలో, వీధుల్లో, పార్కుల్లో, ఇరానీ

హోటళ్ళలో టీ తాగుతూ చర్చించుకుంటుండే వాళ్ళం. ఆత్మ విమర్శలు, పర విమర్శలు, కావ్యవిమర్శల్లో గంటల తరబడి పగళ్ళూ, రాత్రుళ్ళూ గడుస్తుండేవి. అట్లాంటి గంటల్లో ఒక చోట- బహుశా 1957లోనో 1958లోనో అనుకుంటూ- ఒక వారం 'స్వతంత్ర'లో విషయసూచిక పక్కపేజీలో అచ్చయిన "సౌందర్యపు స్వగతం" అనే ఖండికను గురించి చర్చించు కుంటున్నాం. కవి పేరు 'సుధ' అని కొంచెం షనులో వుంది. ఆ రోజుల్లోనే నేను 'స్వతంత్ర'లో రాస్తున్న నియో భావ గీతాలను అంతగా మెచ్చుకోని మా 'బకోక్కడు' (జె. లక్ష్మీ నారాయణ అనే స్నేహితుడు, 'సౌందర్యపు స్వగతా'నికి ఇంప్రెస్ అయ్యాడు. 'సుధ' గొంతులో విశిష్టతను గుర్తు పట్టాం. తర్వాత ఎక్కడో కలిశాడీ కవి. అతని పేరు కేశవరావు అని తెలిసింది. 'ఫరవా లేదు పైకొస్తావు' అని బుజం తట్టినట్టు కూడా గుర్తు. కేశవరావు మరో అయిదుగుర్తో కలిసి దిగంబర కవితోద్యమం ప్రారంభించినప్పుడు 'నగ్నముని'గా మారాడు.

దిగంబరోద్యమం ఒక చారిత్రక అవసరంగా వొచ్చింది. ఒక ఉద్యమంగా అది నిర్వహించవలసిన కర్తవ్యం నిర్వహించింది. ఆంధ్ర కవిత్వ చరిత్రలో అతి కొద్దికాలంలో (సుమారు అయిదేళ్ళు) సాహిత్యం మీద అంతగాఢముద్ర వేసిన కవితోద్యమం యింకొకటి కనబడదు. కాలెండరు కవిత్వాలూ, ప్రాజెక్టుల కవిత్వాలూ రాసుకునే కవులనూ, రాజకీయోద్యమం బలంగా లేకపోవటం వల్ల నిద్రపోతున్న 'అభ్యు దయ' కవులనూ, వాక్య చమత్కారాలతో వచన గీతాలతో ప్రభుత్వ కవి సమ్మేళనాల్లో, ఆలిండియా రేడియోలో చెవుల హోరెత్తించే కవులనూ, కొంత శృంగారం, మరికొంత అభ్యుదయం కలిపి కాసేపు గేయాలు కాసేపు వచన కవిత్వంరాసి పత్రికల్లో పుంఖాను పుంఖంగా అచ్చేసే కవులనూ, ఏం చెబుతున్నారో తమకే తెలియని అమోమయ

కవులనూ గొరడా దెబ్బలవంటి తమ 'దిక్' లతో కొట్టి కాలాన్ని కదిలించింది దిగంబర కవిత్వం. మరుగున పడ్డ సాంఘిక ప్రయోజనం అనే లక్ష్యాన్ని మళ్ళీ ముందుకు తెచ్చింది. ఇది తేలికైన పని కాదు. చెప్పే దాంట్లో వున్నశక్తి వల్లనే ఇది సాధ్యమైంది. వ్యక్తీకరణలో స్వేచ్ఛా ప్రవృత్తికి కూడా ఇది దోహదం చేసింది. ఈ దిగంబర కవితోద్యమంలో అత్యంత ప్రధాన పాత్ర వహించాడు నగ్నముని.

దిగంబర కవిత్వం మీద, అందులో భాగమైన నగ్నముని కవిత్వం మీద నాకు కొన్ని రిజర్వేషన్లు లేకపోలేదు. ప్రత్యేకించి నగ్నముని వ్యక్తీకరణ మార్గం మీద నాకు కొన్ని అభ్యంతరాలున్నయ్. అతని కధల మీద, మరీ ముఖ్యంగా 'విలోమకధల' మీద నగ్నముని ఒప్పుకోలేని అభిప్రాయాలున్నయ్, అయితే, దిగంబర కవిత్వం సాధించిందాన్ని గురించి ఒప్పుకోటానికీ, నగ్నముని కవితాశక్తిని గుర్తించటానికీ ఈ రిజర్వేషన్లు నాకడ్డం రాలేదు.

'సౌందర్యపు స్వగతం' నుంచి 'కొయ్యగుర్రం' వరకు ఎదిగిన కవి సామాన్యుడు కాడని అప్పుడు అనుకున్నాను, ఇప్పుడూ అనుకుంటున్నాను. ఇరవయ్యేళ్ళ కిందటనే కొందరం గుర్తించి ఊహించినట్టుగానే కేశవరావు దళలవారీగా గొప్పకవిగా ఎదిగాడు. ఇతని అసామాన్యత్వం అతని ప్రయోగాలన్నిటిలో కొట్టవచ్చినట్టు కనిపిస్తుంది. ఈ అసామాన్యత్వానికి పరిణతరూపంగా 'కొయ్యగుర్రా'న్ని గుర్తిస్తున్నాను.

'కొయ్యగుర్రం' 1-1-1978 తారీకుగల 'ప్రజాతంత్ర' వారపత్రికలో మొదట వచ్చయింది. కానీ ఆ సంచిక 1977డిసెంబరులోనే మార్కెట్లోకి వచ్చింది. అంతకు ముందటి సంచికలో 'తుపాను వ్యవస్థ మీద తెలుగు కవి కన్నెర్ర'-అని వచ్చే సంచికలో రాబోయే కావ్యాన్ని

గురించి ప్రకటించారు. ఈ కావ్యాన్ని నగ్నముని ఒకటి రెండు చిన్న సమావేశాల్లో చదివి వినిపించాడని తెలిసింది. కాని నాకు ఆ సభలకు వెళ్ళే అవకాశం కలగలేదు. విన్న వాళ్లు చెప్పారు-చాలా బాగుందని గొప్పగా వుందని. నగ్నముని గొంతులో ఒక గాంభీర్యం, ప్రౌఢమాధుర్యం ఉన్నై. అందువల్ల అతను చదువుతుంటే విన్న వాళ్ళు ఇంప్రెస్ కావటంలో ఆశ్చర్యం లేదు. మధునా పంతుల సత్యనారాయణ శాస్త్రిలాంటి వాళ్ళు పద్యం చదువుతుంటే శ్రోతలు ముగ్ధులయినట్టు, నగ్నముని కవిత్వం చదివే పద్ధతికి సహజంగా ఆకర్షితులవుతారు. కాని నాకా అవకాశం దొరకలేదు. అందుకు విచారించటం లేదు. కారణం - 'ప్రజాతంత్ర' సరాసరి పోస్టులో మా ఇంటికి వచ్చింది. ఏకబిగిని పెద్దగా చదివాను, ఇంట్లో అందరికీ చదివి వినిపించాను. మహాకావ్యం చదివిన అనుభూతి కలిగింది. అందుకే 'కొయ్యగుర్రం' మహాకావ్యం. ఆధునిక మహాకావ్యం. తెలుగు సాహిత్యంలో అభినివేశమూ, అభిరుచీ వున్న రష్యన్ మిత్రుడు నికీతా గూరోవ్, నేనూ ఒక రోజు యూనివర్శిటీ గెస్ట్‌హౌస్‌లో కలిసి చదువుకున్నాం. అదే అనుభూతిని ఇద్దరమూ పొందాం. నా 'ప్రజా తంత్ర' కాపీ కావాలని గూరోవ్ తనతోపాటు రష్యా తీసుకెళ్లాడు. రష్యన్ భాషలోకి అనువదించాలనే కోరిక ప్రకటించాడు. ఇదంతా జరిగిన చాలా రోజుల తరువాత, బహుశా కొన్ని నెలల తరువాత నగ్నముని కనిపించాడు. మనసారా అభినందించాను.

ప్రాచీన మహా కావ్యాలకు కొన్ని లక్షణాలున్నై. రస పోషణాదులు కాక ఆవసరమైన ఇతి వృత్తం, వర్ణనలు, అలంకారాలు, సర్గ బంధం ఇత్యాదులు చాలా ఉన్నై. వీటన్నిటికీ ప్రయోజనంలో మూలతత్వం ఒకటే. కొద్దిపాటి చమత్కారాలతో గిలిగింతలు పెట్టి అల్పానుభూతి కలిగించటం కాక సీరియస్ భావాలతో మహానుభూతి

x

కలిగించటం మహాకావ్య ప్రయోజనం. ప్రాచీన కవులు ఇందుకు ఇతి వృత్తాన్ని ఆలంబనంగా ఎన్నుకున్నారు. కథాగమనంలో వైవిధ్యం ద్వారా కావ్యానుభవాన్ని కలిగించాలి కాబట్టి సహజంగా కావ్య విస్తీర్ణత పెరుగుతుంది. మహాకావ్యం సహజంగా సైజులో పెద్దది కూడా అవుతుంది.

ఈ శతాబ్దపు కవిత్వంలో ఖండ కావ్యాలూ, లఘుకావ్యాలూ, మొదలైనవి చాలా వచ్చినై. ఈ కాలంలో వున్నారు కాబట్టి ఈ కాలపు ఇతి వృత్తం తీసుకున్నారు. వ్యక్తీకరణలో, పోలికల్లో కొంత భేదం కూడా ఉంటే ఉండొచ్చు. ప్రాచీన కవిత్వంలో ఒక శాఖగానే ఇవి నిలుస్తయ్. అందువల్ల యివి 'ఈనాటి కావ్యాల' వుతాయే కాని ఆధునిక కావ్యాలు మాత్రం కావు.

ఆధునిక కవిత్వంలో వచ్చిన ఒక ప్రధానమైన మార్పు కథను వదిలెయ్యటం. కథా కావ్యాల్లో ఒక చిక్కుంది, కథా నిర్మాణం కోసం కవిత్వం కాని విషయాలున్న పద్యాలు రాయాల్సి ఉంటుంది. ఎప్పుడో కలగబోయే కావ్యానుభూతి కోసం కొంత చెత్తను కూడా భరించాల్సి వస్తుంది. అది చెత్త అనిపించకుండా ఉండటం కోసం కవి చమత్కారాన్ని కలిగించే వర్ణనలు చేస్తాడు. కథను వదిలివేస్తే ఈ కసరత్తులు చెయ్యక్కర్లేదు. చక్కని చిక్కని భావాల ద్వారా కవిత్వాన్ని సృష్టించొచ్చు. ఈ ప్రయోజనం దృష్టితోనే ఇంగ్లీషుతో 'Poem' అనే దానికి సమానంగా తెలుగు కవిత్వంలో 'కవితా ఖండిక' ప్రవేశించింది. కిందటితరం భావగీతాలు, తరువాత తరం అభ్యుదయ గీతాలు, ఆ తరువాత వాళ్ళ వచన గేయాలు మొదలయినవి ఇట్లాంటివే. వీటిల్లో కథ ఉండదు. భావప్రధానంగా ఉంటై. ఇందుకు పత్రికా ప్రచురణ కూడా కొంత కారణం పత్రికల్లో వెరైటీ అవసరం కాబట్టి ఒక్కో రచన- మరీ ముఖ్యంగా

కవిత్వమైతే ఒకటి రెండు పేజీలకన్నా ఎక్కువ కేటాయించలేరు, కాకపోతే ఇంకో రెండు పేజీలు, అందువల్ల, ఒకే భావాన్ని వ్యక్తం చేసే కథారహిత కావ్య ఖండికలు ఇటీవల ఎక్కువగా వస్తున్నయ్. వాటిని ఇంకా పొదుపు చేస్తూ, ఖండికను ఇంకా కుదిస్తూ ఇటీవల మినీ కవితలు కూడా వస్తున్నయ్. ఒకే భావాన్ని అత్యంత క్లుప్తంగా కుదించి చెప్పి కవితానుభూతి కవసరమైన వాతావరణాన్ని నిర్మించుకునే పనిని పాఠకుడికే వదిలేస్తాయి ఈ మినీ కవితలు.

వ్యక్తీకరణలో ఆధునికత కోసం ఇంగ్లీషు 'ఫ్రీవర్స్' అనే వచన కవితా రూపం తెలుగులో బాగా ప్రచారమయింది.

కొద్దో గొప్పో మాత్రాగేయాలు వస్తున్నా, ఎక్కువగా అచ్చులో వచన కవిత్వమే కనిపిస్తున్నది. కవిత్వంలో 'అర్బేనిటీ' (urbanity)ని సాధించడానికి వచన కవిత్వం కవితా వాహకంగా బాగా పనికొచ్చింది. అయితే ఇందులోమా కొన్ని కథాకావ్యాలు వచ్చినా వాటిలో ఆధునికత లోపించిందనే చెప్పాలి. సాంప్రదాయిక మైన అలంకారాలు, వర్ణనలు, కథ మొదలైనవన్నీ అట్లాగే ఉంచి పద్యం బదులు వచనం వాడితే చాలు ఆధునిక కవిత్వం అవుతుంది అనిఅనుకునే వాళ్లున్నారు. 'ఆధునికత' అనేదిఎన్నుకున్న వస్తువులోనో, ఛందస్సులోనో ఉంటుందను కోవటం వల్ల ఈ అపోహ కలుగుతుంది. ఆధునికతకి ఈ రెండూ అవసరమే. కాని అంతమాత్రమే చాలదు. బుద్ధితోపాటు వేదనతో కూడిన ఒక తాత్విక చింతన కావాలి. వ్యక్తీకరణలో చమత్కారాలకి బదులు సీరియస్ నెస్ కావాలి. వీటన్నిటి కలయికనే 'అర్బేనిటీ' అంటున్నాను. అది ఉంటేనే ఆధునిక కవిత్వం అవుతుంది. ఛందస్సు లేకుండా రాసిన విచిత్ర వాక్యసముదాయం ఆధునికత కాదు. ఈ దృష్టితో చూస్తే పత్రికల్లో అచ్చయే వచన

కవితా ఖండికలన్నీ 'నేటి కవితలు' అవుతై గాని 'ఆధునిక కవితలు' కావు.

కావ్యఖండికల్లో ఒకే వస్తువు (అంటే కథ కాదు) ఒకే భావం ఉంటై. ఒక ఖండికలో భిన్న భావాలను కలిగించటం కష్టం. దానికి కొంత విస్తీర్ణత కావాలి. మనం రోజూ చూసే ఖండికల కన్నా పెద్దవిగా ఉంటే తప్ప భిన్నభావాలను చెప్పటం కుదరదు. అంటే మహాకావ్యం కావాలి. మహాకావ్యానికి విస్తీర్ణత ప్రధానం కాదుగాని అవసరమైన ఒకలక్షణం. పెద్ద పాయింటులో అచ్చెయ్యటం వల్లనో, పాదాలుగా విరవటంవల్లనో కవిత్వం కానట్టే, విస్తీర్ణత వల్లే ఏదీ మహాకావ్యం కాలేదు. ఒక ప్రధాన వస్తువుతో, ఒక తాత్త్విక చింతనతో, సందేశంతో, అనేక భావాలతో, moodతో కథ లేకుండా, 'ఆర్కెనిటీ' అనే లక్షణం కలిగివుండి, తగినంత విస్తారంగా ఉన్న దీర్ఘ కవితను ఆధునిక మహాకావ్యం అంటున్నాను. ఈ నిర్వచనంతో కొలిచి చూస్తే 'కొయ్యగుర్ర'మే మొదటి ఆధునిక మహాకావ్యంగా కనిపిస్తున్నది. కావ్య ఖండికల సంపుటులు చాలానే వచ్చినై. భావ, అభ్యుదయ, విప్లవకవుల ఖండికల సంపుటులు మహాకావ్యాలుగా భ్రమపడగూడదు. వాటిల్లో ఏ ఒక్క సంపుటి తీసుకున్నా ఫిలాసఫీ ఒకటే కావచ్చు; భాషా వైవిధ్యమూ వుండొచ్చు. కాని భిన్న భావాలను కలిపే నిర్మాణబంధం (structural tie) లేక పోవటంవల్ల అవి ఖండికల సంపుటులే అవుతై కాని మహాకావ్యాలు కావు. ఆ ఖండికలను మొత్తం నుంచి విడదీసి చదివితే విడినవాటికి గాని, మిగిలిన వాటికిగాని నిర్మాణరీత్యా లోపం ఉండదు. అదే వాటి ఖండత్వానికి గుర్తు. మహాకావ్యం భావరీత్యా ముక్కలుగా కనిపించినా నిర్మాణరీత్యా అఖండం.

ఆధునిక వస్తువుతో, ఆధునిక ఛందస్సుతో—అంటే వచన కవితలో— అఖండమైన కావ్యాలు కొన్ని వచ్చినై. వాటిల్లో వివిధ భావ సమ్మేళనం కూడా ఉంది. వాటిని మహా కావ్యాలు అన్నా అభ్యంతరం చెప్పను. కాని అవి ఆధునిక కావ్యాలు కావు.

నగ్నముని తన కవిత్వమంతా ఫ్రీవర్స్‌లోనే రాస్తాడు. ఫ్రీవర్స్‌కో స్వేచ్ఛ ఎక్కువ. అదే దాని బలం. అయితే ఈ స్వేచ్ఛవల్ల కవికి బాధ్యత కూడా పెరుగుతుంది. ఛందస్సులో రాసే వాళ్ళకి పదాల ఎన్నికలో స్వేచ్ఛ ఉన్నా కవితారూపంలో స్వేచ్ఛలేదు. అది సిద్ధంగా ఉంటుంది. ప్రసిద్ధంగా ఉన్న రకరకాల పద్యగేయ భేదాల్లో కవి కొన్నిటిని ఎన్నుకుంటాడు. ఫ్రీవర్స్‌లో కవితారూపం సిద్ధంగా ఉండదు. కవే తయారుచేసుకోవాలి. ముందుగా తయారు చేసుకోటమంటూ ఉండదు. కవితా రచన, రూపరచన ఏకకాలంలో జరుగుతై అందువల్ల కవికి శ్రమ, బాధ్యత ఎక్కువ.

సిద్ధాంతరీత్యా ఛందస్సుల్లో అనంత రీతులు సాధ్యమయినా మౌలికమయిన ఛందోరీతులూ, కవుల వాడుకలో ఉన్న పద్యగేయ భేదాలూ పరిమితమైనవే. వాటిలో ఏవో కొన్నిటిని ఎన్నుకుని రాసేకవికి దారితప్పే ప్రమాదం ఉండదు. ఫ్రీవర్స్‌లో మాత్రం కవితారూపాల సంఖ్యకు పరిమితిలేదు. ఎప్పటికప్పుడు కవితారచన, రూపరచన జమిలిగా చేసుకుంటూ పోవాలి.

ఛందస్సులో కొన్ని రకాల పద్యాల్ని మార్చి వాడుకుంటూ పోతే రూపవైవిధ్యాన్ని సాధించొచ్చు. అంటే రూపవైవిధ్యం కొన్ని నిర్ణిత పద్ధతుల్లోనే ఉంటుంది. ఫ్రీవర్స్‌లో వైవిధ్యంకూడా కవి స్వయంగా కవితా రచనతోపాటే ఆలోచించుకోవాలి. మహాకావ్య

రచనలో అదియింకా అవసరం. వైవిధ్యం లేకపోతే ఫ్రీవర్సు మరీ విసుగెత్తిస్తుంది. కేవలం వాక్య భేదాలతో వైవిధ్యం సాధించాలనుకుంటే చిత్రవాక్య రచనతో 'సీరియస్‌నెస్'ని పోగొట్టుకునే ప్రమాదముంది. మహాకావ్య రచనకిది మరీ ప్రమాదం. ఛందస్సుల్లో వాక్య నిర్మాణాన్ని గురించి కవి ఎక్కువ శ్రమ పడక్కర్లేదు. సాధారణ వాక్యాల్నే వాక్య నిర్మాణం అనుమతించే పదక్రమ భేదాలను పద్య గేయ చట్రాలలో ఇమిడించవచ్చు. కాని ఫ్రీవర్సులో వాక్యరచన సాధారణ వచనంలో వాక్యరచనకన్నా భిన్నంగా ఉంటూ పద్యత్వాన్ని రానీయకుండా ఉండాలి. వచనంగా ఉంటూ, పేలవంగా ఉండకూడదు. వాక్యాల మధ్య అంతస్సంబంధాల్ని కల్పించుకుంటూ కవితా రూపాన్ని అల్లుకోవాలి.

ఫ్రీవర్సులో మంచికవిత్వం రాయాలంటే ఈ చిక్కులన్నీ ఉన్నై. అందుకనే ఈ బాధలన్నీ పడలేని వాళ్లు కొన్ని అడ్డదార్లు తొక్కుతుంటారు. తెలుగులో వాక్యం చివరవుండే క్రియను ముందు పెట్టుకోవటం; చేతికి వచ్చినట్టు ముక్కలుగా విరవటం; తమ్మిడూ, నేస్తం వంటి పిచ్చి సంబోధనలు మధ్య మధ్యలో అతకటం; కొన్ని ప్రశ్నార్థక వాక్యాల్ని పదే పదే రిపీట్ చెయ్యటం; పల్లియలు-మల్లియలు అనే విధంగా అత్యప్రాసలు కలుపుకోటం; గారడీ వాక్యాలు, హాస్యోక్తులు, మధ్యలో తిట్లూ కూర్చటం, సింబాలిజం పేరిట అయోమయపు సంకేతాలు గుప్పించటం-ఇవీ ఇటీవల ఫ్రీవర్సు రాస్తున్నవాళ్ళు చేస్తున్న ట్రిక్కులు. వీటివల్ల కొంత అర్థంకాని అయోమయ కవిత్వం, మరింత సభా రంజనకు పనికొచ్చే విదూషక కవిత్వం మాత్రమే వస్తున్నది. వచనకవిత్వం ఇంతటి అదోగతిలో ఉన్న సమయంలో ఉదాత్తమైన వస్తువుతో, సీరియస్‌నెస్ ఎక్కడా చెడకుండా 'ఫ్రీవర్సు'నే కవితా వాహకంగా గ్రహించి ఆధునిక మహాకావ్యాన్ని సృష్టించి ఒకే

సారి-తెలుగు కవిత్వాన్ని-వచన కవిత్వాన్ని-ఆధునిక కవిత్వాన్ని మళ్లీ పైకెత్తిన నగ్నమునిని మెచ్చుకోకుండా ఉండలేను.

ఇంక-దిగంబర కవుల్లో నలుగురు అప్పటి విప్లవ రచయితల సంఘంలో చేరారు. విరసంలో పాణిగ్రాహి, శివసాగర్ల పాటల ఖాణీలకు చారిత్రకావసరం దృష్ట్యా ఎక్కువ గౌరవం, ఆదరణ వచ్చినై. ఈ ప్రభావం వల్ల చెరబండరాజు వచన కవిత్వపు కుబుసం వదిలేసి పాటలకవిగా బయటికొచ్చాడు. గద్దర్ పాడే బతుకుపాటలు సామాన్య ప్రజల్లో చైతన్యం కలిగించట మేగాక నాటి ఉద్యమ కవితకు నమూనాలుగా నిల్చి ఉత్తమ కవితాభిమానుల్ని ఆకర్షించి కొత్తకవుల్ని పాటలవైపు లాగేసినై. పాటలు పాటలేకాని 'కవిత' కాదనే అభ్యుదయ కవిత్వపు నాటి దళ దాటి, పాటల్లో కూడా మంచి కవిత్వం ఉండవచ్చనే మధ్యదళను కూడా దాటి అసలు పాటల్లో రాస్తేనే ఉత్తమ కవిత్వం అవుతుందనే దళవచ్చింది. ఇప్పుడు. చెరబండరాజు లాగా మారలేని ఉద్యమకవులు గద్దర్ తదితర ప్రజాకవుల పాటలశక్తికి తట్టుకోలేక వాటి ఆధిక్యాన్ని ఒప్పేసుకున్నారు. రాయటం కూడా తగ్గించుకున్నారు. అదే ఉద్యమంలో భాగమయిన నగ్నముని పాటల ఆధిక్యాన్ని ఎక్కడా ఒప్పుకున్నట్టులేదు. ఫ్రీవర్సు వదిలినట్టూలేదు. పట్టు విడువని విక్రమార్కుడిలా తనభావాలను ఫ్రీవర్సులోనేరాస్తూఉన్నాడు. పాటల ప్రవాహానికి ఎదురీది సామాజిక చైతన్యాన్ని కలిగించే కవిత్వం ఇవాళ తెలుగులో రాయటం సాహసంగా కనిపిస్తుంది. ఆ సాహసం చేస్తున్నందుకు నగ్నమునిని అభినందిస్తున్నాను. ఒట్టి సాహసమే అయితే చాలామంది చేస్తున్నారు. ఫ్రీవర్సును కూడా ఉద్యమోన్మఖంగా సమర్థంగా వాడుకోవచ్చని 'కొయ్యగుర్రం' లాంటి మహాకావ్యం ద్వారా అత్యంత శక్తిమంతంగా రుజువు చేసినందుకు నగ్నమునిని మరోసారి అభినందిస్తున్నాను.

దుర్దినాలు గుర్తుండ కూడదని కోరుకుంటాం. 1977 నవంబరు 19 తెలుగుజాతి తరతరాలుగా గుర్తుంచుకోవలసిన దుర్దినం.

ఇనప నాడాల్తో
చెక్క హ్యాండయుతో
ధన మదంతో
అలగా జనం బుజాల మీద
స్వారీ చేసే కొయ్యగుర్రా

లున్నంతకాలం గుర్తుంచుకోవాల్సిన దుర్దినం

మసిషి బతికుండగా
దాహం తీర్చలేని ఉప్పునీటి సముద్రం
నదుల మంచి నీళ్ళని కౌగిలిలోకి లాక్కుని
తనివి తీరా తాగి తాగి
తెగబలిసిన కొండ చిలువలా
మెలికలు తిరిగి
కాలంపై
భూ గోళంపై
అలగా జనం ముఖాలపై
వృక్షాలపై పశువులపై
సమస్త జంతుజాలంపై
చీకటి ముసుగు హఠాత్తుగా కప్పి
నీటితో పేనిన తాళ్లతో గొంతులు బిగించి
కెరటాల్తో కాచేసి వికటాట్టహాసంతో
బుసలు కొడుతూ పరవళ్ళు తొక్కిన రోజు
1977 నవంబరు 19.

కొయ్య గుర్రమెక్కి
కొయ్యకత్తితో వూరేగే ప్రభుత్వానికి

తీరమ. తటా గుడిశె వుందని తెలుసు
గుడిశె ము-దు పుట్టలున్నాయని తెలుసు
పుట్టలో కోడె నాగులున్నాయని తెలుసు
పడగల్లో విషము ుదని తెలుసు

అయినా ప్రకృతి విలయ తాండవానికి ప్రజల్ని వదిలేసిన పరి పాలకులే హంతకులన్న విషయం ఈ కావ్యం చదివితే మనం గ్రహించ గలం. కొయ్యగుర్రాన్ని తగల బెట్టగల కొత్త ఇంధనాన్ని కనిపెట్ట టమే కర్తవ్యం అని కూడా మనకు ఈ కావ్యం గుర్తు చేస్తుంది.

పాలకుల పుట్టినరోజు పండగలకు, మంత్రుల సన్మాన సంచికలకు చెక్క భజన చేసే కవులను వదిలేస్తే (వాళ్ళు ఉప్పెన కవిత్వం రాయ టమే కాక కొయ్యగుర్రం తరఫున దివి తాలూకా వెళ్ళి అక్కడ కవి సమ్మేళనాలు జరుపుకున్నారు!) ఆనాటి దారుణానికి ఇంత గాఢమైన ఆక్రోశం వెల్లడించే కవిత్వాన్ని నేను చూడ లేదు. ఇంకో చెప్పుకో దగిన కవిత గద్దర్ రాసిన 'వరద పాట'. గద్దర్ పాటలో ఆవేదన కనిపించినంతగా ఆక్రోశం కనిపించదు.

"తల్లులు చూడంగా బాబు
పిల్లలు మునిగారు బాబు
పిల్లలు ఏడ్వంగ బాబు
తల్లులు మునిగారు బాబు" అని

ప్రజల భాషలో, పలుకుబడిలో హృదయ విదారకంగా గద్దర్ వర్ణించాడు. అయితే, కరిగిన గుండెల్ని కర్తవ్య దీక్షతో గట్టి పరిచే ప్రయత్నం గద్దర్ చెయ్యలేదు. హంతకుల్ని సరిగ్గా నిరూపించ లేదు.

'దివిసీమ అంతనూ బాబూ
ఎర్ర సీమైతేను బాబూ

ఏటి బాదలు పోవు బాబూ
కోటి బాదలు తీరు బాబూ' అని

ఒక సందేశంతో పాట ముగుస్తుంది. ఈ ముగింపుకు అవసరమైన వాతావరణం, పరిణామం పాటలో కనిపించవు.

1977 నవంబరు 19 నాటి ఉప్పెన వల్ల జరిగిన దారుణాల కారణాల లోతుల్లోకి వెళ్ళి ఆక్రోశాన్ని వెల్లడించి, తుపాను వ్యవస్థ మీద మనకు ఆగ్రహాన్ని కలిగించటం 'కొయ్యగుర్రం' అనే ఈ కావ్య లక్ష్యం. ప్రకృతి చేసిన విలయ తాండవాన్ని ఇంతసమర్థంగా వర్ణించిన ఇంకో కావ్యం నా దృష్టికి రాలేదు. ఈ సందర్భంలో అవినీతి పరుల అసమర్థ పరిపాలకులను హంతకులుగా నిరూపించిన ఇంకో కావ్యం కూడా నా దృష్టికి రాలేదు. ఇది ప్రీవర్సుకే సంబంధించింది కాదు తెలుగు కవిత్వానికి సంబంధించింది. 1977 నవంబరు తుపాను మొదటిదీ కాదు, చివరిదీ కాదు. 1969 మే తుపానులో కొన్ని ఊళ్ళే కొట్టుకు పోయిన జ్ఞాపకాలు ఇంకా మాసి పోలేదు. 1978 గుజరాత్ వరదల నష్టం నిన్న మొన్నటిదే. ఏటేటా దేశంలో తుపానులు, వరదలు వస్తూనే ఉంటాయి. పేద ప్రజలు చలికో, వరదకో, తుపానుకో బలి అవుతూనే ఉంటారు. కొయ్యగుర్రం మీద ఊరేగే ప్రభుత్వాలకు ఇవి పట్టవు. వాళ్ళకు కావలసిన కాంట్రాక్టర్లున్నారు. కానుకలిస్తారు. ఎన్నికల తంతు యదావిధిగా జరుగుతుంది. చెక్కహృదయపు కొయ్యగుర్రం సిగ్గు విడిచి ఊరేగుతూనే ఉంటుంది. దాన్ని తగల బెట్టడం ఒకటే పరిష్కార మార్గం. అదే ఈ మహాకావ్యం ఇచ్చే సందేశం. 1977 నాటి సంఘటన ఈ కావ్యానికి ప్రత్యక్ష ప్రేరణ మాత్రమే. అసలు సమస్య ఒక సంఘటనకు పరిమితమయినది కాదు. అట్లాగే ఈ కావ్యం కూడా.

ఇంతకాలంగా ఈ కావ్యం 'ప్రజాతంత్ర' పుటల్లోనే వుండి

పోయిందనే సంగతి తెలుగులో మంచి కవిత్వం కోసం రకరకాల పత్రికల్ని గాలించే పాఠకులకు తెలుసు. కాని, అధిక ప్రచారంలేని, అన్నిచోట్ల దొరకని, ఒకమారు మూల పత్రికలో వచ్చుకావటం వల్ల ఈ కావ్యాన్ని ఎరగనివాళ్ళు ఇంకా ఉ దొచ్చు. ఇంత గొప్ప కావ్యం ఇన్నాళ్లు (ఆధునిక కాలమానంలో రెండేళ్ళు సుదీర్ఘమైన కాలం) 'ప్రజాతంత్ర' పుటల్లోనే ఉండిపోవటం మన దురదృష్టం. దీని స్థానం మనందరి హృదయాల్లో, మన ఆలోచనల్లో మన కార్యాచరణలో, కర్తవ్య దీక్షలో.

నేను ఇంతగా మెచ్చుకునే ఈ కావ్యంలో గొప్పదనం ఏమిటి? అనే ప్రశ్న ఈ కావ్యపాఠకుల్లో కొందరికైనా రావచ్చు. (నిజానికి కావ్యం చదివేవాళ్ళకి ఇట్లాంటి ప్రశ్నలు రాకూడదు) కవి ఆవేదనకు, ఆక్రోశానికి, ఆగ్రహానికి ఫలితం ఈ కావ్యం, ఇంతవరకూ చెప్పినవి కాక చెప్పగలిగిన కారణాలు మరికొన్ని చెబుతాను.

అతి దారుణమైన, అత్యంత ఆనూహ్యమైన సంఘటన జరిగినప్పుడు స్పందించే కవి హృదయంలో ఎట్లాంటి భావ సంఘర్షణ జరుగుతుందో అదంతా ఈ కావ్యంలో కనిపిస్తుంది. బాధ, నిర్వేదం, కోపం, వైరాగ్యం-ఇవన్నీ ఒక్కోసారి వేరువేరుగానూ, ఇంకోసారి కలిసిపోయీ ఈ కావ్యంలో కనిపిస్తయ్. మనలోనూ సహానుభూతిని కలిగిస్తయ్.

సాంఘిక ప్రయోజనం దృష్టితో రాసిన రచనలను విమర్శించేటప్పుడు మన విమర్శకులకు యాంత్రిక పద్ధతి ఒకటి అలవాటయిపోయింది. ఆ దృష్టితో 'చదివితే'—

నాకు చంద్రమండలం వొద్దు
విమాన యానాలు వొద్దు

XX

కాలాన్ని జీవితాన్ని కలుషితంచేసే
రాజకీయ కార్యకలాపాల్లోద్దు
రైళ్లోద్దు బస్సులోద్దు
ఈ నాగరికత రద్దీ వొద్దు
పాతరాతియుగ పనిముట్లు పట్టుకుని
చరిత్ర చీకటి కోణాల గుహల్లోకి
వెళ్ళిపోతాను—

వంటి వాక్యాలు చదివినప్పుడు కవి నాగరికతను వద్దని రాబిన్ హుడ్ లాగా ఎక్కడికోవెళ్ళి కొత్త జీవితం, ఊహాకల్పితమైన జీవితాన్ని గడుపుదామనుకుంటున్నాడని యాంత్రికంగా విమర్శించటానికి వీలుంది.

కానీ, మానవజాతి కంతటికీ తనను సంకేతంగా చేసుకొని తాను ఏమీచెయ్యలేనితనానికి సిగ్గుపడి కొత్త జీవితాన్ని ప్రారంభిస్తున్నానని చెప్పటం ఇక్కడ ఆయన ఉద్దేశం. జరిగింది చరిత్రలో కనీవినీ ఎరుగని దారుణ వైపరీత్యం. దారుణ సంఘటనలు జరిగినప్పుడు హేతువాద దృష్టితో ఆలోచించటం అన్నివేళలా సాధ్యం కాదు. స్పందించే కవికి అది మరీ కష్టం. అందువల్ల, అసలు ఈ ప్రపంచం మీద, ఈ నాగరికత మీద అసయ్యం పుట్టటం అసహజం కాదు. దీన్ని నిరాశావాదమనీ, కాల్పనికవాదమనీ, ఇంకా ఇట్లాంటి అరిగిపోయిన మాటలతో పేర్లు పెట్టటం తేలికే. ఎప్పుడో సరిగ్గా గుర్తులేదుగాని, ఇరవయ్యేళ్ళకు పూర్వమే ఒకానొక విమర్శకుడు శ్రీశ్రీ 'దేశ చరిత్రలు' అనే గేయంలో—

'ఏ దేశ చరిత్ర చూసినా
ఏమున్నది గర్వకారణం
నరజాతి చరిత్ర సమస్తం

పరపీడన పరాయణత్వం' అన్న పాదాలనుదాహరించి శ్రీ శ్రీని నిరాశావాదిగా చిత్రించాడు. అతను, నా జ్ఞాపకాన్ని బట్టి, కమ్యూనిస్టు విమర్శకుడు. అప్పుడు చంద్ర రాజేశ్వరరావుగారు జోక్యం చేసుకుని ఆ విమర్శకుణ్ణి ఖండించారు. ఆ విమర్శకుడు తన పొరపాటును ఒప్పుకున్నట్లు ఇక్కడ చెప్పటం న్యాయం. ఆ రకమైన యాంత్రిక విమర్శలకు ఎప్పుడూ అవకాశం ఉంటూనే ఉంటుంది గనకే ఈ విషయాన్ని గురించి ఇంతగా చెప్పాను. నగ్నముని మీద ఇట్లాంటి ఆరోపణలు చెయ్యటానికి అవకాశాలు ఎక్కువ.

అట్లాగే—

ఇప్పుడు ఎవరయినా ఎవర్నయినా కొత్తగా చంపేదేమిటి?
ఏ క్షణంలో దేవుడు పుట్టాడో
ఏ క్షణంలో విధిరాత నుదిటిపై
లిఖించబడిందన్నారో
ఆ క్షణమే మనిషి చచ్చాడు
కర్తవ్యం చచ్చింది
ఇప్పుడు కొత్తగా ఎవరయినా ఎవర్నయినా చంపేదేమిటి?
ఇప్పుడు కొత్తగా సముద్రం చంపేదేమిటి?
ఇప్పుడు కొత్తగా కొయ్యగుర్రం చంపేదేమిటి?

అన్నప్పుడు నిరాశా వాదమో, సినిసిజమో కనిపించవచ్చు. కాని మనిషికి జరిగే అన్యాయానికి విధికారణమనుకునే అజ్ఞానాన్ని విమర్శించటమే ఇక్కడ నగ్నముని చేసింది. ఆ రకమైన భ్రమల నుంచి వాస్తవ దృక్పథం వైపు చూపు మళ్ళించటమే కవి లక్ష్యం. దేవుడు, విధి అనే భావాలు కర్తవ్యదీక్షను ఎట్లా చంపేస్తయ్యో సూచించటమే కవి ఇక్కడ ఉద్దేశించింది.

బక్కచెద్దులు వెంటరాగా నాగలి బుజాన వేసుకుని

పొలం వెళ్ళే ప్రతిరైతూ నాకు శిలువ మోస్తున్న
జీసస్‌లా కనిపిస్తాడు

—అన్నప్పుడూ

మానవుడి మనసులో మాత్రం మహాబోధి
ఎప్పుడో కూలిపోయింది"

—అన్నప్పుడూ

నగ్నముని మత సంబంధమైన ప్రతీకలను వాడాడని విమర్శించే అవకాశం ఉంది. ఇక్కడ 'జీసస్'నీ 'మహాబోధి'నీ వాడింది మత సంకేతాలుగా కాదు. కావ్యంలోనే ఇంకోచోట చెప్పినట్టు "చివరికి తన నెవరు మోసం చేస్తారో జీసస్‌కి తెలుసు". నాగలి మోస్తున్న రైతును జీసస్‌తో పోల్చటం వల్ల వాంతకులెవరో తెలుసుకోమన్న హెచ్చరిక ఉంది. అట్లాగే 'మహాబోధి' జ్ఞానానికి సంకేతం. మానవుడి జ్ఞానం అసమర్థమైపోయిందన్న బాధ ఇక్కడుంది. ఇంకోచోట సూచించినట్టుగా 'జీవితం సాంకేతికమై జ్ఞాన నేత్రం తెరుస్తుందనడం అబద్ధం. పెరిగిన సాంకేతిక విజ్ఞానం మనిషిలో జ్ఞాన నేత్రాన్ని తెరవక పోవటం వల్ల ఈ విజ్ఞానం అవసరమైన చోట అవసరమైనవారికి ఉపయోగ పడకుండా పోయింది.

నిజానికి ఈ కావ్యానికి వ్యాఖ్యానాలు, వివరణలు అవసరమని నేనను కోవటం లేదు. నగ్నముని ఇతర కవితలతో పోలిస్తే ఇంత స్పష్టత ఉన్న కవిత ఇంకోటి దొరకదు.

"కొయ్య గుఱం
స్తబ్ధతకీ, మూర్ఖతకీ, అజ్ఞానానికీ, అహంకారానికీ
అసమర్థ నిదానపాలనకీ ప్రతీక."

అని తను ఏ ప్రతీకను ఎందుకు వాడాడో కూడా చెప్పుతున్నాడు. నగ్నముని కవిత్వంలో ప్రతీకల గందరగోళం ఎక్కువని,

ఆయన వాక్యాల్లో 'సింటాక్సు' (Syntax) సరిగ్గా ఉండదనీ ఒకప్పుడు గోల పెట్టిన వాణ్ణే. కాని సంకేతాల్ని మరీ ఇంత స్పష్టంగా వివరించాలని కూడా నేను ఆశించలేదు.

సామాజిక ప్రయోజనం దృష్ట్యా రాసే కవిత్వం ఈనాడు ఎక్కువగా వస్తున్నది. అందులో కొంత ఉద్యమాల్లో మమైక్యం చెందిన వాళ్ళ నుంచి, మరి కొంత ఉద్యమ సానుభూతి పరుల నుంచి. రెండు రకాలుగా మంచి కవిత్వమే వస్తున్నది. మార్గాల్లో భిన్నత్వం కవిత్వానికి గుణాన్ని కూర్చి పెడుతున్నది. అయితే కవిత్వాన్ని విశ్లేషించి వ్యాఖ్యానించే విమర్శ సాహిత్యం ఆవసరమయినంతగా వస్తున్నట్టు లేదు. వచ్చిన కొద్ది విమర్శల్లో కూడా యాంత్రిక ధోరణులు తరచుగా వస్తున్నయ్. నగ్నముని కవిత్వం మీద ఇట్లాంటి విమర్శలు వచ్చే అవకాశం ఇంకా ఎక్కువవుంది గనుక ఈ ఒకటి రెండు వివరణలు ఇచ్చాను.

ఈ 'కొయ్యగుర్రం' మహాకావ్యం అంటున్నాను. ఒక కవిత మహాకావ్యం కావటానికి చాలా విషయాలు కారణమవుతై. కావ్య వస్తువు, కవితా పద్ధతి, రచనా వైవిధ్యం, సందేశం—ఇట్లాంటి విషయాలన్నిట్లోనూ కవి ప్రతిభ వల్ల ఒక కావ్యం మహాకావ్యం అవుతుంది. ఈ కావ్యంలో వస్తువు ఉదాత్తమని చెప్పక్కర్లేదు. కొయ్యగుర్రాన్నెక్కి ఊరేగే అసమర్థ ప్రభుత్వాల్ని హంతకుల్నిగా నిరూపించి కొయ్యగుర్రాన్ని తగలబెట్టే ఇంధనాన్ని సమకూర్చుకోమనే సందేశం ఈ కావ్యంలో ఉంది. రచనా పద్ధతిలో నగ్నముని సాధించిన విశేషాలు అతని ప్రత్యేకతను నిలబెడుతున్నయ్.

కవిత్వంలో ప్రతిపాదించే విషయానికి బలం చేకూర్చే గొప్ప వాక్యాలు ఈ కావ్యంలో వాలంటీర్లలా కవిత్వానికి దారిచూపుతై.

'హంతకులెవరో నాకు తెలుసు
నెపం కాసేపు సముద్రం మీదకి తోస్తాను'

'అయినా మరేం ఫర్వాలేదు
కంకాళం సంజాయిషీ కోరదు'

'మరేం ఫర్వాలేదు
అనాధ ప్రేతం సంజాయిషీ కోరదు!
'జెండా కన్నీరు కార్చదు'

పూర్వం 1965లో కాబోలు అజంతా 'జెండాలకు కన్నీళ్లు లేవు' అనే శీర్షికతో ఒక కవిత రాశాడు, అయితే ఇక్కడ నగ్నముని వాడిన తీరు వేరు. అజంతా జెండాని సామ్రాజ్యవాదానికి సంకేతంగా వాడుకున్నాడు. నగ్నముని కొయ్యగుర్రపు చెక్క హృదయానికి సంకేతంగా వాడాడు.

ప్రతీవస్తువులో ఒకే శైలిని సాగదీస్తూ విసుగెత్తించటం తేలిక. ప్రతిభావంతుడైన కవి భావాలతో పాటు రచనలో కూడా వైవిధ్యం చూపిస్తాడు. ఈ విషయంలో నగ్నముని పడ్డ జాగ్రత్త మనం స్పష్టంగా గుర్తించొచ్చు. అందాన్ని ఆనందాన్ని గుర్తుచేసుకునే చోట కృష్ణ శాస్త్రి గారితో పోటీ పడుతూ—

"ఒకప్పుడు ఇక్కడో వూరు వుండేది
పడుల బారలు కోటెడు పళ్ళు కొరికి
గుసగుసలు పోయేవి
ఒకప్పుడు ఇక్కడ బంగారం బరువుకి ఒరిగి
పాలాలు హాయలు హాయలుగా నృత్యం చేసేవి.

ఈ పై వాక్యాల్లో కింద గీతలు పెట్టిన పదాల ఎన్నిక, మొత్తంలో పదాల పొందిక చెప్పదల్చుకున్న అందమైన భావనకు తగిన శైలీ లాలిత్యాన్ని సమకూర్చినై.

అవసరానికి పనికిరాని మన సాంకేతిక విజ్ఞానాన్ని అవహేపించే చోట—

'రోడ్డ పక్క ప్లాస్టిక్ చెట్లు నాటుదాం
ప్లాస్టిక్ కొమ్మలపై ప్లాస్టిక్ పక్షుల్ని కూచోబెడదాం
ప్లాస్టిక్ కంకులు నాటి
పొలాలు బంగారం పండిట్లు చూపుదాం
జనం ఆనందంగా ఆడుకుంటూ పాడుకుంటూ జీవిస్తున్నట్లు
మరబొమ్మలు చేయించి కీ యిచ్చి ఇంక పార్లల్లో వొదులుదాం
ప్లాస్టిక్ ఆవుల ప్లాస్టిక్ గేదెల ప్లాస్టిక్ బొదుగులు పితుక్కుని
ప్లాస్టిక్ పాలు తాగుదాం
కొయ్య గుర్రాన్ని ఒహో ఒహో అంటూ
జీవితాంతం మోద్దాం."

ప్లాస్టిక్ ఇమేజరీ సామాన్యమైన వాటి నుంచి అసాసూన్యమైన వాటి వరకు పొడిగించి సాధించిన శైలి అవహేపాన్ని సరిగ్గా వ్యక్తం చేస్తున్నది. ఈ అవహేపాన్ని ప్లాస్టిక్‌తో అంతం చెయ్యకుండా పల్లకీ లాగా కొయ్యగుర్రాన్ని మోయటం సూచించటం వల్ల అనవసరమైన పొడిగింపు (monotony) పోయి వైరైటీ వచ్చింది. ఒకే భావాన్ని శైలీ భేదాలతో వ్యక్తీకరించటం వల్ల భావానికి బలం కలుగుతుంది.

కొంత విస్తారమైన కావ్యంలో భావాల్లోనూ, భావవ్యక్తీకరణలోనూ శైలిలోనూ వైరైటీ సాధించటం అవసరం. అత్యంత విరుద్ధమైన భావాల్లో ఒక దానున్నించి ఇంకోదానికి దూకిస్తాడు నగ్నముని. వైరైటీ సాధించటానికి ఇతను పాటించే పద్ధతుల్లో ఇదొకటి.
చాలా తాత్వికంగా—

"జీవితాన్ని మించిన నిశ్శబ్దం
వెలుతుర్ని మించిన నిశ్శబ్దం
శబ్దాన్ని మించిన నిశ్శబ్దం

వేగాన్ని మించిన నిశ్శబ్దం
విశ్వాన్ని ఆక్రమించి
శవం కన్నులో నిలిచిపోయిన
నిశ్శబ్దం

అని వర్ణించిన 'మహా నిశ్శబ్దం' తరవాత కవి వెంటనే చిన్న పిలాడయిపోయి—

'సముద్రం' గుర్తుందా నీకు
చిన్నప్పుడు
తెల్లటి నురగల్లో బొచ్చు కుక్క పిల్లలా
నువ్వు నా కాళ్ళ చుట్టూ చుట్టేసుకుంటూ తిరిగినప్పుడు
అలల నాలికల్తో నా పాదాల్ని నాకినప్పుడు
నిన్ను అమాయకపు ప్రాణివనుకున్నాను
నిన్ను పెంచుకుందామనుకున్నాను.
నీ ఘోష మాన్పి లాలిద్దామనుకున్నాను.

అని సముద్రాన్ని బుజ్జగిస్తున్నాడు. పూర్వ ఖండిక (9) 'నిశ్శబ్దం'తో ముగుస్తుంది. తరవాత ఖండిక (10)లో 'ఘోష' వినిపిస్తుంది. పూర్వ ఖండికలో తాత్విక గాంభీర్యం వ్యక్తమయితే తరవాత ఖండిక ప్రారంభంలో చిన్న పిల్లల అమాయికత మెత్తని చేత్తో తాకుతుంది. పూర్వ ఖండికలో రంగం ఆకాశంలో నక్షత్రాల కవతల ఉంది. తరవాత ఖండంలో రంగం కళ్ళకెదురుగా ఈ నేల మీదే ఉంది.

భాషాల్లో వైరుధ్యాన్ని (పోలారిటీని) ఇన్ని రకాలుగా సూచించటం వల్ల పాఠకుడి మనసులో భావ సంఘర్షణ, సమ్మేళనాలను కలిగించి కవితామయం చేస్తుంది. మహాకావ్య రచన చేస్తున్న కవి మాత్రమే చెయ్యగలిగిన పనులివి.

ప్రజలను ముంచెత్తిన ప్రళయాన్ని వస్తువుగా తీసుకొని మహాకావ్యం రాసేటప్పుడు ఫార్ములా పద్ధతి కవిత్వం రాయటం కుదరదు. అందువల్ల ఈ కావ్యంలో ప్రజల బాధలను వర్ణించేసి ఒక సందేశంతో పూర్తి చెయ్యలేదు. ఉప్పెన కలిగించిన నష్టమూ ఉంది, [illegible]

లోతుల్లోకీ పోయాడు, సందేశమూ ఉంది. వీటన్నిటినీ మామూలు కవిగా కాక తాత్వికుడుగా మానవ నాగరికత, జీవిత ధ్యేయం మొదలైన వాటిని గురించి చేసిన ఆలోచన, పడిన తపన ఇందులోకనిపిస్తయ్. అందుకే—

ఆలోచనకీ మనిషికీ వున్న సంబంధం ఏమిటి?
భాషకీ భావానికీ వున్న సంబంధం ఏమిటి?
వేదనకీ శరీరానికీ వున్న సంబంధం ఏమిటి?
నేలకీ నీటికీ వున్న సంబంధం ఏమిటి?

అనే మూల భూతమైన ప్రశ్నలు వేసుకుంటాడు. ఈ రకపు తాత్విక మైన ఆలోచనా పద్ధతి (Plilosophical tone) కావ్యమంతటా కనిపిస్తుంది. దాన్ని గుర్తించి చదివినప్పుడే ఈ కావ్యం మనకు పూర్తిగా అర్థమవుతుంది. కవి ఒకొక్కసారి పోట్లాడి కాట్లాడి చింపిన విస్తరివంటి ఆకాశంలో, చిందరవందరైన మెతుకుల్లాంటి నక్షత్రాలకవతలికి పోయి చూస్తాడు. అక్కడి నుంచి సరాసరి నేల మీదికి వచ్చి సముద్ర ఘోష వింటాడు. చరిత్రలో వెనక్కి వెళ్లి జీనస్‌ను స్మరిస్తాడు. బుద్ధుడిని వదిలి అశ్రునయనాల్తో తిరిగివచ్చిన గుర్రాన్ని గుర్తుచేసుకుంటాడు, మళ్లీ ఇప్పటి కొయ్యగుర్రాన్ని గురించి చెపుతాడు. సమస్త విశ్వాన్ని సమస్త కాలాన్ని రంగం చేసుకున్నట్టుగా కనిపిస్తుంది. ఆలోచనలకు అవధుల్లేకపోవటం వల్ల అవి తాత్విక స్థాయికి చేరినై. కావ్యం-మహాకావ్య స్థాయికి ఎదిగింది.

ఇంతటి గొప్ప కావ్యం పత్రికల పుటల్లోనుంచి రెండేళ్ళ తర వాతయినా బయటికొస్తున్నందుకు నాతో పాటు కవితాభిమానులంతా సంతోషిస్తారనుకుంటాను. అంతే కాక ఈ కావ్యం ఒక్కటే ఒక ప్రత్యేక పుస్తకంగా తీసుకురావటంలో కనిపించే అభిరుచిని మెచ్చుకుంటున్నాను.

ఈ ఆధునిక మహాకావ్యంలో నేను గుర్తించిన విశేషాలను ఈ పుస్తకంతో పాటే చెప్పుకునే అవకాశం కలిగినందుకు సంతోషిస్తున్నాను.

హైదరాబాదు
1979 డిసెంబరు

చేకూరి రామారావు

కొయ్యగుర్రం

జీవితం మిథ్య అనడం అబద్ధం
ఎంగిలి మెతుకులేరుకుని ఎలక్ట్రిక్ తీగల మీదా
ఇళ్ళ కప్పుల మీదా జంతు కళేబరాల మీదా
అలగాజనం పుళ్ళ మీదా
పొదుచుకు తినడానికి చేరే కాకులు మాత్రమే
మిథ్య గూర్చి కావుకావుమంటూ ప్రవచించగలవు

మానవత్వం బతికి వుందనడం అబద్ధం
కప్పుకోడానికి మేక చర్మాల కోసం తిరిగే
మెకాలు మాత్రమే నీతి వాక్యాలు వేదికల నుంచి
ఉపన్యసించగలవు

ఏశ్వర్యేయం కావ్యం అని అరుస్తూ
ప్రబంధ నాయకి తొడల బంధనాల్లో
పాదాలకు పూసుకుని ఎగిరే లేపనాలో
అంటుకున్న కవిత్వం అబద్ధం

తపస్సు చెయ్యడానికి వెళ్ళవలసింది
హిమాలయాలోకి కాదు
జనం లోకి

పరిత్యజించవలసింది సంసారబంధం కాదు
స్వార్థాన్ని

ఓంకారం కాదు
ఆర్తనాదమే జీవికి అన్ని భాషల్లోనూ మిగిలే
అనివార్య అంతిమ శబ్దం

జీవితం సాంకేతికమై జ్ఞాననేత్రం తెరుస్తుందనడం
అబద్ధం

మనిషి శతాబ్దాలు గడిచేకొద్ది నాగరీకుడవుతాడనడం
అబద్ధం

ఈ భూమిపై నిరంతరం జీవన ఘోషతో
రోడ్ల ప్రక్కన పడి మూలుగుతూ దొర్లుతున్న
కొన వూపిరి నిజం
మృత్యువు నిజం

మౌనాన్ని మిగిల్చి వెళిపోయిన శవం నిజం
దరిద్రం నిజం
దరిద్రం చిమ్మే చీకటి నిజం
సమస్త లోకాన్ని బతికించే సంపద సృష్టించే వాడి రక్తం
విలువలేని ఖనిజం

జీవితం నాగలై
చర్మాన్ని దున్ని ముడతల చాళ్ళతో నింపుతుంది
అనుభవాల పంట బంగారం పండుతుంది
పండించిన వాడి నోటిలో మొలిచేది మాత్రం జిల్లేడు
కళ్ళలో కదిలేవి వెలుగు కిరణాలు కాదు
కన్నీళ్ళు

అంతరిక్ష నౌక
చంద్రమండలం వేపు దూసుకు వెడుతుంది
దానిలోనే పొంచున్న ఓ దోమ శాస్త్రవిజ్ఞాన ప్రగతిని
పరిహసిస్తూ వ్యోమగానం చేస్తుంది

కవిత్వం కాగితాలపై అక్షరాల్ని ఖననం చేసే
కాటికాపరి

కవి నుండి బయటపడ్డ ప్రతి అక్షరం
భావాన్ని భ్రూణహత్యచేసిమరీ
బయట పడుతుంది
కవిని హంతకుడిగా చిత్రిస్తుంది

అక్షరాల్ని నిత్యం శంకించి ఉపయోగించేవాడే
నిజమైన కవి

మనిషిలోని అన్ని అంగాలూ
జంతువులుగా మారడానికే
జీవితాంతం ప్రయత్నిస్తాయి

ప్రకృతిలోని అన్ని గ్రహాలూ
భూమిని ప్రభావితం చెయ్యడానికే
గిరగిరా తిరుగుతాయి

చివరకు మిగిలేది
గాయంగాని రక్తం మరకగాని కనబడని
హత్య మాత్రమే

నేను బహుశా ఒకే పాట పాడుతున్నాను
నేను జీవితాంతం ఒకే పాట పాడతాను
నా పొట్టలోంచి ఒక పేగును బయటికి పీకి

ఏక్‌తారాగా వాయిస్తూ వీధివీధినా
పాడుకుంటూ పోతాను

నిజాన్ని వినగల చెవి కోసం
లోకమంతా
గాలిమీద గాలిసాను

4

పొద్దు తనను పొడవక ముందే
బక్కపెద్దలు వెంటరాగా
నాగలి బుజాన వేసుకొని
పొలం వెళ్లే ప్రతి రైతూ నాకు
శిలువ మోస్తున్న జీసస్‌లా కనిపిస్తాడు

అవును
నేను హత్య గురించి మాట్లాడుతున్నాను

చివరి విందులో
చివరికి తననెవరు మోసం చేస్తారో
జీసస్‌కి తెలుసు

హంతకులెవరో నాకు తెలుసు
నెపం కానేపు సముద్రం మీదకి తోస్తాను

కేలండర్‌కి రక్త మాంసాలుండవు
కేవలం కాలంకుక్కినోటిలోని ఎముకముక్క
గోడకు బల్లిలా కరుచుకుపోయిన వుత్తి
కాగితం ముక్క
తారీకులు ముదాయిలా బోనులో నిలుచునుంటాయి
అది ఏ తారీకన్నా కావొచ్చు
అది నవంబర్ 19 కావడం యాదృచ్ఛికం కావొచ్చు

ప్రళయాలూ పరిహాసాలూ తప్ప కేలండర్‌లో
కన్నీటి గుర్తులుండవు
వారాలు రోగుల్లా ముసుగుదన్ని పడుకునుంటాయి
ముసుగు కప్పిన మూలుగులపై వెల్లవేసే తెల్లకాగితం
కాలాన్ని దినాలుగా వారాలుగా ముక్కలు చేస్తే
కారుతున్న తెల్లటి రక్తం
తెల్లని రక్తం వెనక ముసుగు తీసి మూలుగు వినగలిగితే
అది ఏ దినమన్నా కావొచ్చు ఏ వారమన్నా కావొచ్చు
కాలనేత్రం మాత్రం శనివారం గాలానికి తగిలి
తన్నుకుంటూ ఆగిపోయింది

ప్రకృతిలోగాని వికృతిలోగాని
దానవత్వపు అంధకారమే నిరంతరం
మనుషుల్ని పాలించే నిజం
మానవత్వం మాత్రం
ప్రతిరోజూ ప్రతి క్షణం పుట్టి చచ్చే
వెలుగు కిరణం

5

జెనీవాలో శాంతి మహాసభలు జరుగుతాయి
దేవాలయాల్లో అర్చనలు జరుగుతాయి
సత్రాల్లో అన్నదానాలు జరుగుతాయి
మసీదుల్లో ప్రార్థనలు జరుగుతాయి
దెయ్యాలు లేని భాషల్లోని వేదాలూ
ఏకరంగుల గొంతుల్లో వల్లిస్తాయి

ఎగదేసిన పావురం చివరికి పిల్లి నోటికే చిక్కుతుంది
అర్చనలూ అన్నదానాలూ చూసి
ఆకలి పగలబడి నవ్వుతుంది

ఆకలి తిరగబడితే అదుపులో పెట్టడమెలాగో
ఆకలి తీరిన వాడికి తెలుసు
గురి పేల్చే గుండు ఏ గుండెను చీల్చనుందో
ట్రిగర్ నొక్కే వేలికి తెలుసు
హంతకులెవరో నాకు తెలుసు
కవిగా మోసగాడిగా నెపం కాసేపు
కాలం మీదకి నెట్టేస్తాను

బట్టలేసుకుని నగ్నత్వంలోకి పారిపోతుంది
నాగరికత

కేబరేలో ఖాదాత్మ్యం పొందే కళ్ళలో దాక్కోడానికి

ప్రయత్నిస్తుంది
అక్కడా ఆకలే
అనంత రూపాల్లో ఆకలి
బతికున్నంతకాలం మనిషిని వేటాడుతుంది
బతుకు నిండా కలుగులే
బతకడం మాని అంతా పారిపోవడమే

ప్రపంచమంతా ఎక్కడికో ఏ యదార్థం నుంచో
పారిపోతోంది ఒగురుస్తూ పారిపోతోంది
కత్తితో మృత్యుహస్తం వెంటాడుతున్నట్లు
పారిపోతోంది

మనిషి ఊపిరి కోయ్యడానికి
కత్తే కానక్కర్లేదు
జీవితాల్ని చెరచడానికి
మరుక్షణం మృతకళేబరం చెయ్యడానికి
తుపాకులూ యుద్ధాలే రానక్కర్లేదు
నూరేళ్ళు నవ్వుతూ తుళ్ళుతూ పేయిరేకలతో
చెలుగులు వెదజల్లుతూ పుష్పించవలసిన బతుకుల్ని
భగ్గున మండించెయ్యడానికి పెట్రోలే అక్కర్లేదు
ఉప్పు నీళ్ళు చాలు

దాహం తీర్చి ప్రాణం నిలబెట్టవవలసిన నీరే
గొంతు పిసగ్గలదు
మానవ దౌష్ట్యానికీ ప్రకృతి ప్రళయానికీ
విరిగిపోయేవి దరిద్రుల ఎముకలే
చివరికి మిగిలేవి గుడిశెల మృతకళేబరాలే

హెలికాప్టర్లోంచి చూసినా విమానంలోంచి చూసినా
కార్లలో టోపీల్లో పత్రికా ప్రకటనల్లో దాచుకొని
లోంగి చూసినా
ప్రగ్గరకు వెళ్ళి కదిపి చూసినా
దగా దుర్మార్గం దాచుకుని
దయా ప్రేమ అభయ ముద్రతో చూసినా
ఒకటే దృశ్యం
ఒకటే పొర్లుతున్న మౌనశోకం
అయినా ఫర్వాలేదు
శవం
సంజాయిషీ కోరదు

చివరి విందులో
చివరికి తననెవరు మోసం జేస్తారో
జీసస్‌కి తెలుసు
హంతకులెవరో నాకు తెలుసు
నెపం కాసేపు ప్రకృతి మీదకి తోసేస్తాను

ఒకప్పుడు ఇక్కడో ఊరు ఉండేది
ఒకప్పుడు ఇక్కడి గాలి నిండా నేల నిండా
ఆకాశం నిండా మనుషుల పాటలు మాటలు
ఊర్పులు ఓదార్పులు నవ్వులు నిట్టూర్పులు
కలకలం కలగానంకనబడేది వినబడేది

చెట్ల ఆకులు పచ్చగా గాలిలో ఊదేవి
పక్షుల కారులు కొంతెగా పళ్ళు కొరికి
గుసగుసలు పోయేవి

ఒకప్పుడు ఇక్కడ బంగారం బరువుకి ఒంగి
పొలాలు హాయలు హాయలుగా నృత్యం చేసేవి

కాలానికి సిగ్గులేదు చరిత్రకు సిగ్గులేదు
సృష్టికి సిగ్గులేదు

బలహీనుడు సంపద సృష్టిస్తాడు
బలవంతుడు సంపద మింగి దరిద్రం పంచుతాడు
చరిత్ర నిండా దరిద్రుల శవాల గుట్టలే

6

అర్ధరాత్రి
అంతఃపురం వొదిలి తలిదండ్రుల్ని వొదిలి
పెళ్ళాం బిడ్డల మధ్యగా పెనవేసుకున్న
పేగు తెగ్గోసుకుని
సకల సంపదల్ని పరిత్యజించిన సిద్ధార్థుణ్ణి
రాజ్యం పొలిమేరవరకూ చేరవేసి తిరగొచ్చిన
అశ్వం
అశ్వనయనాల్లో నాగార్జున కొండలో ఇంకా

నిలబడే వుంది
మానవుడి మనసులో మాత్రం
మహాబోధి ఎప్పుడో కూలిపోయింది

7

అశ్వం
వేగానికి విశ్వాసానికిచిహ్నం
విజయానికి పరిపాలనా దార్ఢ్యానికి సంకేతం
కొయ్యగుర్రం
స్తబ్దతకి మూర్ఖతకి
అజ్ఞానానికి అహంకారానికి
అసమర్ధ పరిపాలనకి ప్రతీక

అశ్వ హృదయం
అశ్వనయనాల్తో నిలబడే వుంది
కొయ్యగుర్రం మాత్రం
పూటా రూపాయి మోతతో
భీకరంగా సకలిస్తోంది
కొయ్యగుర్రం భూమ్మీద నడవదు
ఇనప నాడాల్తో చెక్క హృదయంతో ధనమదంతో
అలగాజనం బుజాలమీద స్వారీ చేస్తుంది

బరువుకి కుంగిపోతూ తలలెత్తితే
భీషణంగా సకిలించి అణగదొక్కుతుంది
కొయ్యగుర్రమెక్కి కొయ్యకత్తితో
ఊరేగే ప్రభుత్వాలు
దేవాలయాల మీది బూతుబొమ్మలు

8

చివరి విందులో
చివరికి తననెవరు మోసం జేస్తారో
జీసస్‌కి తెలుసు

తీరమంతటా గుడిశె వుందని తెలుసు
గుడిశె ముందు పుట్టలున్నాయని తెలుసు
పుట్టల్లో కోడె నాగులున్నాయని తెలుసు
పడగల్లో విషముందని తెలుసు
పాలు పోసే చేతినే అదనుచూసి పడగతెరటాలకోరలు
కాటేసాయని తెలుసు
హంతకులెవరో నాకు తెలుసు
అయినా నెపం కాసేపు సముద్రం మీదకి తోసేస్తాను

నిద్రపోతే కలలు కళ్ళనికుడతాయి
కదిపితే తేనెటీగలు ఒంటిని వెంటాడి మరీ కుడతాయి
కదపకపోయినా నోరు మెదపకపోయినా
క్షుద్రరాజకీయాలు
నిండు జీవితాల్ని కుడతాయి
మనిషిని మనిషి చేసే మోసం కాలానికి తెలుసు
కారణాలు కార్ల్‌మార్క్స్‌కి తెలుసు

రోడిన్
మ్యూజియంలో శిల్పంగా మారి
గడ్డానికి చేతిని అన్చి
ఆలోచిస్తూనే ఉంటాడు

ఆలోచనకీ మనిషికి వున్న సంబంధం ఏమిటి
భాషకీ భావానికి వున్న సంబంధం ఏమిటి
వేదనకీ శరీరానికి వున్న సంబంధం ఏమిటి
నేలకీ నీటికి వున్న స బంధం ఏమిటి

9

అంతవరకీ
ప్రపంచంలోని అర్ధరాత్రుల గదుల్లోని

భాష అంతా ఒకటే
రెండు శరీరాలు ఏకమయ్యే సమయం
గడియారంలోని ముళ్ళు రెండూ ఒకటి కావడానికి
తహతహలాడిపోయే సమయం
కొత్త కొత్త కలలు చర్మంలో ప్రాణం పోసుకునే
సమయం
వసంతం దిగివచ్చి శరీరాల మీంచి
పక్షిలా పాడుతూ రెక్కలతో విసురుతూ
యవ్వన పరిమళాలతో
ఎగురుతూ ఎగిసిపడే సమయం
అప్పటికప్పుడు మొక్కలు చెట్లయి మొగ్గలు వేసి
క్షణంలో సగంలో పుష్పించి ఫలించి కాలానికి కొత్త
అర్థమిచ్చే సమయం
చెట్టుమీది పువ్వుతుంపి సిగలో తురిమి
ఆదుకుని అదుముకుని అల్లుకుపోయే సమయం
ఆకాశవృక్షాన్ని కుదిపి రాలిన నక్షత్రాలకాంతిని
కళ్ళలో ఒంపుకుని నిట్టూర్పుల సెగలకి కనబడని
వినబడని ఊదొత్తులు మౌనంగా వెలిగి నీలి పొగల
పాటలు పాడే సమయం

ఇది గది కథ కావొచ్చు ఇది గుడిశె గాథ కావొచ్చు
ఇది పేవ్‌మెంటు వ్యథ కావొచ్చు

పురుషుడు స్త్రీని హృదయానికి హత్తుకుంటాడు
శిశువు మాతృస్తన్యం కోసం వెతుక్కుంటుంది
కాదు కాదు ఇది నిజం కాదు

ఆ క్షణం
ఆవేవనే నిజం
ఆ క్షణావేమే నిజం

కొయ్యగుర్రానికి నిజం తెలుసు
అయినా చెప్పదు
కడలి కెరటానికి నిజం తెలుసు
కెరటాలపై కనబడని రక్తపు మరకలకి నిజంతెలుసు

నదుల మంచినీళ్ళని కొగిలిలోకి లాక్కుని
తనివితీరా తాగితాగి తెగబలిసిన కొండచిలువలా
మెలికలు తిరిగి
కాలంపై భూగోళంపై అలగాజనం ముఖాలపై
వృక్షాలపై పక్షులపై సమస్త జంతుజాలంపై
ఓకటి ముసుగు హఠాత్తుగా కప్పి
సిరితో పేనిన చాళ్ళతో గొంతులు బిగించి
కెరటాల్తో కాటేసి విషకోరలతో
బుసలు కొడుతూ పరవళ్ళు తొక్కింది
మనిషి జతికుండగా దాహం తీర్చలేని
ఉప్పునీటి సముద్రం

మిగిలింది కెరటాలు కాదు
శవాల గుట్టలు
శరీరాల్నుండి తెగిపోయి గాలికి ఊగుతున్న
ఊపిరి దారాలు

హఠాత్తుగా ఉన్మాదిలా ఉవ్వెత్తున లేచిన
లక్షల కెరటాల పదగల బుసలకి
కోడిగుడ్డులా పగిలి సొనకారి చితికిపోయిన
సూర్యుడికవతల
కారుమబ్బుల ఘీంకారపు మెరుపు కార్చిచ్చులో
మాడి మసైన చంద్రుడికివతల
నేల నాలుగుచెరగులా రోడ్ల పక్క పెంటకుప్పల పక్క
కుక్కలూ పందులూమానవాస్థి పంజరాలు
పొట్లాడి కొట్లాడి చింపిన విస్తరిలాంటి ఆకాశంలో
చిందరవందరైన మెతుకుల్లాంటి నక్షత్రాలకవతల
లోకమంతా అరణ్యంలా అల్లుకున్న మతగ్రంథాల
సూక్తులకవతల ప్రార్థనలకవతల
ద్రోహ ఘోష కవతల
విద్రోహి వికటాట్టహాసానికవతల
పెను హత్యకవతల
జీవితాన్ని మించిన నిశ్శబ్దం
వెలుతుర్ని మించిన నిశ్శబ్దం
శబ్దాన్ని మించిన నిశ్శబ్దం

వేగాన్ని మించిన నిశ్శబ్దం
విశ్వాన్ని ఆక్రమించి
శవం కన్నుల్లో నిలిచిపోయిన
నిశ్శబ్దం

10

సముద్రం, గుర్తుందా నీకు
చిన్నప్పుడు
తెల్లటి నురగల్తో బొచ్చుకుక్కపిల్లలా
నువ్వు నా కాళ్లచుట్టూ
చుట్టేసుకుంటూ తిరిగినప్పుడు
అలల నాలికల్తో నా పాదాల్ని నాకినప్పుడు
నిన్ను అమాయకపు ప్రాణివనుకున్నాను
నిన్ను పెంచుకుందామనుకున్నాను
నీ ఘోష మాన్పి లాలిద్దామనుకున్నాను

అవును
నేను సముద్రాన్ని సముదాయిద్దామనుకున్నాను
కాని
కెరటాలకూడా కోరలుంటాయని కనుక్కోలేకపోయాను
గాలి రెక్కలకూడా కత్తులుంటాయని
కానుకోలేకపోయాను
కన్నీళ్లలోకి కూడా రాజకీయాలు ప్రవహించగలవని
తెలుసుకోలేకపోయాను

ఆక్షణం

పెనుకడలి క్షణం

సూర్యుడూ చంద్రుడూ బొగ్గుముక్కలుగా

మారిన క్షణం

అంతా నాశనం

నేలనీ ఆకాశాన్ని నమ్మి బ్రతికిన సమస్త ప్రాణికోటి

మృతకళేబరంగా మారిన క్షణం

చచ్చిన వాడికి చిరునామా వున్నా లేకున్నా

ఫరవాలేదు

పొట్టచేత పట్టుకుని గుప్పెడు మెతుకుల కోసం

ఊరూరా తిరిగేవాళ్ళు ఎంతమంది చచ్చినా

ఫరవాలేదు

వందేళ్ళు నీడనిచ్చిన వటవృక్షం ఫెళఫెళా విరిగిపడినా

పిట్టలు గాలి తాకిడికి రాలిపడినా

ఎలక్ట్రిక్ స్తంభాలు మొక్కల్లా వొంగిపోయినా

లోకంలోని ఆర్తనాదమంతా

చీకట్లో తృటిలో నీటి ఇనప కొగిట్లో అల్లల్లాడి

ఏ మృత్యుహాస దీవులకు చేరిందో

కనుపాపలు టపటపా పక్షులరెక్కలకిమల్లే

కొట్టుకుని చేతులు గొంతు కోస్తున్న

గాలి బాకుల్ని ఆపబోయి పెనుగులాడి

ముక్కలుముక్కలయిపోయి

మరణం ముందు పక్షీ జంతువూ మనిషి

సమస్తం సమానంగా తలవొంచి నిలుచున్నాయి

అన్ని కళేబరాలూ
బతుకుల్ని నిలబెడతామని బుజాలెక్కి కూచున్నవాళ్ళ
అలక్ష్యానికీ అహంకారానికీ సాక్ష్యాలుగా
మిగిలిపోయాయి
అయినా మరేం ఫర్వాలేదు
కంకాళం సంజాయిషీ కోరదు

11

ఇప్పుడు ఎవరయినా ఎవర్నయినా
కొత్తగా చంపేదేమిటి

ఏ క్షణంలో దేవుడు పుట్టాడో
ఏ క్షణంలో విధిరాత నుదుటిపై
లిఖించబడిందన్నారో
ఆ క్షణమే మనిషి చచ్చాడు
కర్తవ్యం చచ్చింది
ఇప్పుడు కొత్తగా ఎవరయినా ఎవర్నయినా
చంపేదేమిటి

ఇప్పుడు కొత్తగా సముద్రం చంపేదేమిటి
ఇప్పుడు కొత్తగా కొయ్యగుర్రం చంపేదేమిటి
మరేం ఫర్వాలేదు
ప్రజాసేవ చెయ్యడానికి కావలసినంతమంది
పోటాపోటీలుపడే దేశ నాయకులున్నారు

శవాల్ని ఖాళీ చెయ్యడానికి
కాకులూ గద్దలూ రాబంధులూ
లేకపోయినా ఫర్వాలేదు
కాంట్రాక్టర్లున్నారు
జాతికి సేవ చేస్తారు

మరేం ఫర్వాలేదు
అనాధప్రేతం సంజాయిషీ కోరదు

జీవితాంతం పదవిని ఒంటినిండా బట్టగా
చుట్టుకున్నవాళ్ళు మరణిస్తే
వినయంతో విషాదంగా తలదించుకుంటుంది
దేశమ్మీద ఎగిరే జెండా
దిక్కూలేని జనం వేనకువేలు దిసమొలల్తో
జీవితాంతం దుమ్ములో జతికి
కళ్ళముందే క్షణంలో దుమ్ములో కలిసిపోతే
జెంతా కన్నీరు కార్చదు
మరింత గర్వంగా గాలిని సవాలు చేస్తూ
ఆకాశాన్ని రెపరెపల్తో పరిహసిస్తూ
తీవిగా ఎగురుతుంది
గాలిలో నాదస్వరం నినదించదు
కాలం గొంతు జీరవోదు
చరిత్ర నయనం చెమ్మగిలదు
కొంత సుఖం
బతికి వున్నవాడు నిజం చెప్పడు


శవం మాట్లాడ లేదు
కొంత సంతోషం
చనిపోగానే మనిషితోపాటు
భాష కూడా చనిపోతుంది
ప్రపంచం చనిపోతుంది
దేవుడు కూడా చనిపోతాడు

ఎప్పుడో ఒకప్పుడు
ఈ బీళ్ళు సాగుచేస్తున్నప్పుడు
హఠాత్తుగా ఒక పుర్రె బయటపడి
పకాలున నవ్వుతుంది

మరేం భయం లేదు
కంకాళం సంజాయిషీ కోరదు

ఈ వ్యవస్థలో
పుట్టడం మోసపోవడానికే
పెరగడం మోసపోవడానికే
ప్రేమించడం మోసపోవడానికే
నమ్మడం మోసపోవడానికే

జీవితం చివర్న పొంచున్నది మాత్రమే
మృత్యువు కాదు
అజ్ఞానంలోనూ మూర్ఖత్వంలోనూ
బతుకు భయంలోనూ ద్వంద జీవితంలోనూ
నయవంచనలోనూ ప్రతిక్షణం వెంటాడేది
మృత్యువే



మృత్యువును జయించడానికి
అంతులేని సాంకేతిక విజ్ఞానం
రోడ్డపక్క ప్లాస్టిక్ చెట్లు నాటుదాం
ప్లాస్టిక్ కొమ్మలపై ప్లాస్టిక్ పక్షుల్ని కూచోబెడదాం
ప్లాస్టిక్ కుంకులు నాటి
పొలాలు బంగారం పండినట్లు చూపుదాం
జనం ఆనందంగా ఆడుకుంటూ పాడుకుంటూ
జీవిస్తున్నట్లు మరబొమ్మలు చేయించి కీ యిచ్చి
ఇసక పర్రల్లో వొదులుదాం
ప్లాస్టిక్ ఆవుల ప్లాస్టిక్ గేదెల ప్లాస్టిక్ పొదుగులు
పితుక్కుని ప్లాస్టిక్ పాలు తాగుదాం
కొయ్యగుర్రాన్ని ఒహోం ఒహోం అంటూ
జీవితాంతం మెడలమీద మోద్దాం

12

చివరి విందులో
చివరికి తననెవరు మోసం చేస్తారో
జీసస్‌కి తెలుసు
హంతకులెవరో నాకు తెలుసు
నెపం నా మీదనే వేసుకుంటాను
నాకు రాకెట్లు వొద్దు చంద్రమండలం వొద్దు
విమానయానాలొద్దు

కాలాన్ని జీవితాన్ని కలుషితం జేసే
రాజకీయ కార్యకలాపాలొద్దు
రైళ్ళొద్దు బస్సులొద్దు యీ నాగరికత రద్దీ ఒద్దు

పాత రాతి యుగం పనిముట్లు పట్టుకుని
చరిత్ర చీకటి కోణాల గుహల్లోకి
వెళ్ళిపోతాను
ఈ శవాల్ని ఈ సమస్త జంతుజాలం కళేబరాల్ని
నా లోనే ఖననం చేస్తాను
కొయ్యగుర్రాన్ని తగలబెట్టగల
ఇంధనం కనిపెడతాను

కొత్త కలల్తో
కొత్త విలువల్తో
కొత్త విశ్వాసాల్తో
విశ్వ వస్త్రం నేసి
తిరిగొచ్చి
దినమొలగా దిక్కులమధ్య దిక్కులేకుండా
పడి వున్న మనిషి ఒంటిపై కప్పుతాను

56

జార్జ్‌వూండెల్ నగ్నమునీ

an interior dialogue

ఇంతకీ ఎవర్నువ్వు? / ప్రత్యేకంగా నేనెవర్ని కాను నన్ను సము
ద్రంలోకి నెట్టారు అదే నా ఆనవాలు / సముద్రంలోకా? ఎవర్ని
న్నలా తోసింది? / రాయీ రప్పా ఇనుమూ పెనమూ రొదా
రోదనా వ్యధా వేదనా అసహ్యమూ అబద్ధమూ వాసనా వేషమూ
నీతీ బుకాయింపూ నిరానందమూ మదాంధతా / ఆగాగు కాసేపు
ఆనందిద్దాం పీతల్ని తిందాం ఇక్కడ కాకపోతే ఇంకెక్కడేనా నీటిలో
పడుకొని / అయితేపద వడగళ్ళ వాన వొడిలోకి ఎండ్రకాయి చితిపిన
మాంసాల లజ్జల ఒడిలోకి / జాని జాని వెక్కిళ్ళ ల్లోంచి

అడుగుతున్నాను ఎవర్నిన్నిలా సముద్ర మృత్యు తొడల
సందుల్లోకి నొక్కింది?/ నేను రాను బయటిక వాడా లుజా
కొడుకు నంజుకు తింటాడు నన్ను స్వార్థాన్ని ఒడ్డున కొరుక్కు
తింటున్నాడు నేను రాను రాను రాను నన్ను ఆ లంజ
కొడుకు నంజుకు తింటాడు నాకు భయం భయం భయం నన్ను
ఆ సెల్లీఫిష్‌గాడు నరుక్కు తింటాడు వాడి నాలుక చీలిక
లయ్యే దాకా / జానీ జానీ ఒక్కసారి ఆ లోతుల్లోంచి తేలి
తేలి ఈది ఈది ఒక్కసారి నా కోసం అలలా రా రారా నా
జానీ రారా నాయనా నా జానీ / ఒద్దు పురుగులు క్రిములు
కీటకాలు నల్లులు బల్లులు గుల్లలు / సరిగ్గా వినపట్టం లేదు
నీ భయపు దుఃఖ సాగర ఘోర ఘోషలో సముద్రాశ్వాల
హేషల్లో ఒచ్చి నత్తగుల్ల లాంటి నీ చెవిలో ఒడిలో ఒక్కసారి
చెప్పు ఎవరు నిన్నా కెరటాల్లోకి విరిచింది విసిరేసింది! / నన్నా!
కుక్కలు క్రూర జంతువులు నా కన్నీళ్ళు నా విశ్వాసాల
పొగలు నా గొంతులోంచి పెగలలేని సెగల పొగల కస్నీళ్ళ
కార్చిచ్చు మసి మసి దుమ్ము ముఖం మీద కణితెలు గుమా
స్తాలు గోమాతలు ప్రభుత్వాలు చట్టాల చట్రాలు న్యాయాల
అధర్మాల నీతుల గోతులు సరిహద్దులు గోడలు దుకాణాల కొను
గోళ్ళు అమ్మకాల కొనగోళ్ళు వర్గాల కులాల మతాల నిమ్నోన్న
తాలు ఔన్నత్యాల గొడ్డాళ్ళ గర్వాల అహంకారాలు ముదిరిన
గడ్డకట్టిన ముఖాల పంచదార లాంటి పేరాశల దురాశల మీద
దుర్మాంసం మీద వాలిన చీమల్ని తోలే ఈగల పూజారుల
మంత్రుల తంతామనే తంత్రాల భయాందోళనల నెత్తిమీద
శతగోపాల దండాల అరదండాల లాఠీల బాకుల చాకుల
తుపాకీల సదాచార నీతుల స్మశానాల గోతులు తవ్వే పోలీ

సుల పొరలు పలుగులు పగిలిన ఎలుగుల ఆక్రందనాలు
ఆత్రరావాలు పంతుళ్ళు హోదాల గోదాల బళ్ళుచచ్చిన
ఆదివారాల చర్చి పాటలు క్రీస్తువైను క్రీస్తు రొట్టి పలాయనం
నాటిన శిక్షకాలయాల తొడలమీద పాకిన తొండలు సినిమాల
అసమయాల సీమల రెక్కల విప్పుడు చప్పుడు పేకాటల
పక్కచూపుల పాకుడు రాళ్ళ కళ్ళ డబ్బులు మూగిన సారా
ఈగలు రేడియోల బండబారిన పేళ్ళు కొడుతున్న గొంతులు
గొడ్డళ్ళు టెలివిజన్ కర్రెపిల్ల అశ్లీలపు అన్వేషణ తల్లి
దండ్రులు వాళ్ళ లచ్చి తల్లిదండ్రులు అబద్ధాల పెంటపోగులు
వాటినుంచి వీచే అశుద్ధాల పరిమళాలు చివరికి మృత్యువు

నన్నీ సముద్రంలోకి నెట్టింది తోసింది
తన్నింది ముంచింది పీక నులిమింది
గుంజింది గింజింది పోనా ప్రియతమా
ఒక్క నువ్వు తప్ప*

*జార్జి మాండెల్ రచన
'ది పెకనింగ్ సీ 'లోని కొన్ని కవితలను
దోసిట్లో పట్టుకొన్న ప్రయత్నమిది

నా రక్తం నిండా విశ్వా రహస్యముద్రాల జంత్ర
వాద్యాలు (హృదిక్) నా ప్రశ్నలకు తలవంచుకు వెనక్కు
మళ్ళే-సముద్ర కెరటాల్లారా (మా) సముద్రాల్ని బంధించానని
సాహసంగా నవ్వుతున్న కొన్ని-చేతివేళ్ళ (జైల్లో సముద్రం)
అయినా—సముద్రాలు నా మీద పొర్లుకొచ్చినా— నిద్ర నటి
స్తోన్న వాళ్ల కళ్ళరెప్పల్ని పీకేయడం మాత్రం మానను
(కొజ్జాల కామకేళి చూస్తున్నాను) ప్రళయంగా నవ్వాలు—
వరదగా నవ్వాలు—ప్రళయ వరద తుఫాను నవ్వాలు —
ప్రమాదం సూచిస్తూ నవ్వాలు—ప్రమాదం తప్పకూడా నవ్వాలు
(అణుదిక్) అనవరతం అశాంతిని పరోషించే—ఓయి దుఃఖ
మూగ సముద్రమా—నీకు నమస్కరిస్తున్నాను—నీకు అభయ
హస్తమిస్తున్నాను (నమస్తేవెన) నదులు నిజస్వరూపం చూసు
కుందామని—సముద్రంలోకి దూకి నిర్వాణం చెందుతున్నాయి—
సముద్రం వేదఘోషపెడుతోంది (భిన్నస్వరాలు) ఆవేశం—
సముద్రమల్లే నా మాటవిని—పొర్లుపంటూ పాదాల్ని కడిగి—
ఒదలని తెల్లపక్కపిల్ల మల్లే కాళ్ళ చుట్టూ తిరుగుతున్నట్లు
(వర్షం పడుతోంది) తప్పదు—గతం త్రవ్వుకుంటే—సము
ద్రం ఘనీభవిస్తుంది (విను) ఒంటిమీద ఒక్కొక్క కెరటం
వొలిచే—సిన—గ్నంగా ఉద్వి—గ్నంగా న—ర్తిస్తోం—
ది—నా ముం—దు—సముద్ర—ం:—(లాండ్‌స్కేప్)సము
ద్రం తెగుతుంది—సమస్తాన్నీ తెంపుతుంది—హోరుమని ఉప
ద్రవంగా మారుతుంది (సముద్రం)★★

★★అన్నీ నగ్నమునివే అక్కడక్కడ
తెగిన పాదాల గాయాలు

ఒక శాంటియాగో ఒక యూపెబ్ ఒక ప్రొవిడెన్స్ ఒక హూవెస్టీల్డ్ ఒక 'క్రాడిల్' విట్మన్, 'ఎండ్‌లెస్లీ రాకింగ్', ఒక "దిస్టార్మ్ రైజెస్" వర్జిల్ ఒక "సీలలబీ" ఎలినార్ వైలీ ఒక లార్డ్ జిమ్ ఒక యూలిసిస్ శాసించగలరు సముద్రాన్ని శపించగలరు. వాచెవడో ఒక బాదెలేర్ బాటమ్‌లెస్ పిట్ నుండి పైకి తమ్ముకు రాగలడు బుగ్గలా. "హెవెన్ హావన్" అని మతాల మడత నలగని తెల్లని ఆపాదమస్తక వస్త్రంలో సర్దుకుపోగలడు హోప్కిన్స్. సముద్రాన్ని గిచ్చి గిల్లి బ్లేడుపెట్టి కోసి చివరికి చేసేందేం లేక మనమంతా ఒక కేలుకు పొయొచ్చు దాట్లో. 'ఇంతేనకే సంద్ర మెంతో లానుకొంటి / మనకు సూడీడుకూ మద్దె నుండేనా' అని ఆపిచ్చి ప్రాణంపు పిల్ల అచ్చెరువొందవచ్చు. ఉపనిషత్తుల్లో ప్రాథమిక సైన్స్ ల్యాబొరేటరీకి అచ్చమైన కవితాత్మని విస్పించవచ్చు. పురాణాల పాలసముద్రాల ఫోం పరుపుల మీద మనపుంతా ఏప్వళించవొచ్చు 'ఆ యమో క్రూర జలరాశి యంచనంత / భంగములు దగ్గ రతుల గనుపించుచునుము / అచట, నా ప్రేయసియను మట్టిబొమ్మకు పటిచి / నేను వళించెదను సుధానిభృత మూర్తి' / యని నాయనిలా మనమును యనుకొనవచ్చును. ప్రమాదము లేదు.

హత్యకీ ఆత్మహత్యకీ తేడా ఏమిటి? జాసీ (జార్జ్ మాండెల్ రాసిన కథ 'ది బెకనింగ్ సీ') నగ్నముని మృత్యువు నిజమన్న మౌనాన్ని మిగిల్చిపోయిన శవం నిజమన్న దరిద్రం చిమ్మే చీకటి నిజమన్న ఉప్పునీళ్ళ నిజమన్న తీరమంతా గుడిసెలున్న గుడిసెలముందు పుట్టలున్న పుట్టల్లో కోడెనాగులున్న పడగల్లోవిషమున్న కెరటాలపై కనపడని రక్తపు మరకలున్న నీటితో పేనిన తాళ్ళతో గొంతులు బిగించి కెరటాల్తో కాలేసి వికటాట్ట హాసాలతో బుసలు కొడుతూ పరవళ్ళు తొక్కుతూ ఉమికిన దుమికిన నవంబర్ 18 1977 సముద్రపు సామూహిక హత్యకూ సంబంధమేమిటి?

జానీ ఆత్మ హత్య చేసుకోబోయాడు
సముద్రం జానీలని హత్య చేయబోయింది
నగ్నముని జానీ ప్రియురాలు

సముద్రమేం చేస్తుంది హత్య? నిద్రలో దాని మానాన అది పడుకొంటుంది, కాకపోతే పాపం కలవరింతల్లో పక్క చెమకలు విరిగేట్లు కొంచెం పొర్లుతుంది. సముద్రానికి ఈ వ్యవస్థ మీద యీ ఉడెన్ హార్స్ మీద జానీకి ఈ వ్యవస్థ మీదలా కొయ్యగుర్రం మీద క్రోధం.

అయితే నిజంగా ఎవరు చేసారీ హత్య? నేటి నుండి విసిగి వేసారి పారిపోయి జానీ ఆత్మహత్యా ప్రయత్నం చేసాడో వాటి మీదనే కోపంతో కృద్ధ సముద్రం ఉప్పొంగి పొర్లి పొర్లి తెర్లి తెర్లి వొచ్చింది. ఎవరు హత్యలు చేసారో చేయిస్తున్నారో ఏ వ్యవస్థ చేయిస్తోందో వాటి మీద క్రోధంతో మేక చర్మాల కోసం తిరిగే మెకాల మీద అనుభవాల బంగారపు పంట పండించిన వాడి నోటిలో జిల్లేళ్ళు మొలిపించిన వాళ్ళ మీద నాగలి బుజాన వేసుకొని పొలం వెళ్ళే ప్రతి రైతుని శిలువ మోస్తున్న జీసస్‌లా చేసిన సాంకేతిక జ్ఞాన నేతల మీద జెనీవాలో శాంతి సభలు చేవాలయాల్లో అర్చనలు సత్రాల్లో అన్నదానాలు జరుపుతున్న వాళ్ళ మీద కాబరేల్లో తాదాత్మ్యం చెందుతున్న కళ్ల మీద బట్టలేసుకొని నగ్నత్వం లోకి పారిపోతున్న నాగరికత మీద హెలికాప్టరులోంచి విమానాల్లోంచి కార్లలో పత్రికా ప్రకటనల్లోంచి దాక్కొని చూచే దొంగ చూపుల మీద బలహీనుడు సృష్టించిన సంపదని మింగి బలవంతుడు పంచిన దరిద్రం మీద

నగ్నముని సముద్రం కత్తిదూసి హత్య చేసింది.

ఇపుడు జానీమాటల్ని నగ్నముని నోటనిలా పల్కిం
చొచ్చు ఇంతకీ ఎవర్నువ్వు?/ నేనొట్టి ఉప్పునీళ్ళని/ ఎందు
కొచ్చావ్ ఉప్పెనలా/ నన్నీ ఛండాలపు నేల మీదికి నెట్టారు/
ఎందుకు ఎవరెందుకు/ రాయీ రప్పా ఇనుమూ పెనమూ
రొదా రోదనా వ్యధా వేదనా అసహ్యమూ అబద్ధమూ వాసనా
వేషమూ నీతీ బుకాయింపూ నిరానందమూ మదాంధతా
వెనక్కు తగ్గు నేను నీ మెర్మైడ్ని; ఈ లంజా కొడుకులు
స్వార్థాన్ని నంజుకు తింటున్నారు మనుషుల్ని సుతారంగా
ఘోర్కల్తో మని పంటి కొరికించుకొంటున్నారు. జీవితం
మిథ్య అంటున్నారు. వాళ్ళు కాకులు శవాల కళేబరాల మీద
పుళ్ళు పొడుచుకు తింటున్న కాకులు ఏశ్వ శ్రేయః కావ్యమే
అంటున్నారు ప్రబంధనాయకి తొడల బంధనాల్లో పాదాలకి
లేపనాలు పూసుకొని ఎగిరి పోతున్నారు./ జానీ జానీ ఆర్త
నాదమే జీవికి అన్ని భాషల్లోనూ మిగిలే అంతిమ శబ్ద మం
టావా/ అవును చదువు నా దిగంబర మానవాళి మీద నా
రాసిన పాటలు ముఖ్యంగా జైల్లో సముద్రం అయినా చివరి
బిందులో నన్నెవరు మోసం చేస్తారో నాకు తెలుసు కవిగా
మోసగాడిగా నెపం కాసేపు నా మీదికే నెట్టేసుకొంటాను
ఫర్ గివ్ దెమ్ ఫాదర్/ అపును గానీ నా జానీ నువ్వేమిటి
గారీ స్నైడర్లా *some yips & Barks in the Dark* లోలా

Each poem grows from an energy-mind-field-dance, and has its own grain. To let it grow, to let it speak for itself, is a large part of the work of the poet. A scary chaos fills the heart as 'spi' ritual breath-in 'spi' ration, and is breathed out into the thing-world as a poem. From there it must to the hearer's under''stand''ing. The widest the

gap the more difficult; and the greater the delight when it crosses. If the poem becomes too elliptical it ceases to be a poem in any usual sense. Then it may be a mantra, *a Koan, or a* dharani అంటున్నావు/ అననా మరి నేను సమస్తాన్ని ఫిష్ ఫ్లెష్ ఫౌల్ సమస్తాన్ని నమస్తివెన చేస్తున్నాను ఒక్క ఈ రాజకీయ అమానుషత్వాన్ని సగం పశువు సగం శిశువుని దక్క నేను బహుశా ఒకే పాట పాడుతున్నాను నేను జీవితాంతం ఒకే పాట పాడుతాను నా పొట్టలోంచి ఒక పేగుని బయటికి తీసి ఏక్ తారగా వాయిస్తూ విధివిధినా పాడుకుంటూ పోతాను నిజాన్ని వినగల ఒకే ఒక చెవి కోసం లోకమంతా గాలి మీద గాలిస్తాను / జానీ జానీ నా తెల్ల బొచ్చుకుక్క పిల్లా నీకు తెలీదా మానవత్వం ప్రతిరోజూ పుట్టి చచ్చే వెలుగుకిరణం ఎందుకు నీకింకా నీ హత్యా ప్రణవం? / ఎందుకా మీ చంపిన శవాలు సంజాయిషీ కోరవు ఉరితీయబడ్డ శిరస్సులు రహస్యాలు చెప్పవు విదూషకులు చివరి నవ్వుల్లో హత్యలు చేస్తారు సిద్ధార్థుడికి కడసారి వీడ్కొలిచ్చిన అశ్వం ఘోటకి కార్చిన కన్నీటికీ మీ కొయ్యగుర్రం ఇనప నాడాల నయన రూపాయల సకిలింపులకీ ఎన్ని శాలివాహన శకాల యుగాల యుగాంతాల వ్యత్యాసం! మహాబోధి కొమ్మల్ని విరుచుకున్న కొయ్య కత్తులు మీవి. కూలి గుర్రము మీద జాలీసు నాను కొని ప్రాణాలు లేనట్టి భగవంతుడొచ్చాడు ఊరంత ఊరేగుతూ ఉత్సవము సాగించుతూ కూలిమాటడగండిరా—అన్నాలు చాలవని చెప్పండిరా / జానీ జానీ నా నగ్న సముద్రమా ఓనా Qceanus (Okeanos) నువ్వు నా గ్రీక్ పురానదివి పృథివి చుట్టూ తిరిగి తిరిగి మహోంబుధి వయ్యావు ఇపుడు నాలుగా చుట్టూ గిరగిరా తిరుగు జానీ జానీ నా నగ్న సముద్రమా నా లంగాలో పదిలంగా దాచుకొంటాను వెక్కిళ్ళల్లోంచి అడుగుతున్నాను. ఎవర్నన్ని లగ [illegible] వేసింది రానాయనా నిన్ను బలంగా కౌగిలించుకొంటాను / ఇద్దు ప్రియతమా

AC No.....

గుర్తుందా నీకు చిన్నప్పుడు తెల్లటి నురగల్లో బొచ్చుకుక్క పిల్లలా నేను నీ కాళ్ళ చుట్టూ చుట్టేసుకుంటూ తిరిగినప్పుడు అలల నాలికల్తో నీ పాదాలని నాకినప్పుడు నన్ను అమాయిక ప్రాణివనుకొన్నావు నన్ను పెంచుకొందామనుకొన్నావు నా ఘోష మాన్పిలాలిద్దామనుకొన్నావు కానీ నేన్నీ లంగా లంగాల్లోకి దూరి కాటేద్దామనుకొన్నాను / ఎంత క్రూరం ప్రకృతీ దేనిమీద నీ వికృతి? / తల్లీ చెల్లీ వల్లీ విను చెప్తా వటుస్థనా లెపుడూ సూర్యోదయానికే విచ్చుకొంటాయి సత్యానికీ ప్రేమకీ త్యాగానికీ ధూళికీ స్వార్థ త్యాగానికీ బతుక్కీ బతక నివ్వటానికీ విచ్చుకొంటాయి ఆపిల్ బ్రెస్ట్‌లా ఎన్ని వేలి ముద్రలో ఆ పళ్ళమీద ఎండకీ సూర్యుడికీ మధ్య కురుస్తోన్న వానలో చినుకు చినుకుకీ మధ్య తడిసిన దయలో కన్నీళ్ళల్లోకి కూడ రాజకీయాలు ప్రవహించ గలవని తెలుసు కొని ఈ ఋణాన నా పెను కడలి ఋణాన సూర్యుణ్ణీ చంద్రుణ్ణీ బొగ్గు ముక్కలు చేసి రాబోయే ఫిబ్రవరి 1980 16న మళ్ళీ వొచ్చి నీ కంట్లో చీకటింటినౌతాను కానీ సత్యమా ప్రియతమా- ఒక్కనీవే నాకు పెక్కు నేనులు నీకు-/ జానీ జానీ నా నగ్నమునీ ఎందుకు సీకీకోపం నీ నీటి ఇనప కౌగిట్లో నన్నే మృత్యుహోస దీవులకు చేరుస్తావ్?/ ఓసి నా లంజా ఇపుడు ఎవరయినా ఎవర్నయినా కొత్తగా ప్రేమించేదేమిటి- నట్టనడి సంద్రాన నావలో ఉన్నాను నావ ఒడ్డట్టించుతావ నా సామి నడి సీటిలో ముంచుతావ- అని కొత్తగా పాడే ప్రేమ గీతాలేమిటి ఇపుడు కొత్తగా సముద్రం చంపే దేమిటి/ ఇప్పుడు కొయ్యగుర్రం చంపే దేమిటి నా నగ్న మునీ! నా నగ్నత్వంలోకి మునిగి ఓ మాట చెప్పు నువ్వూ ఓ కాంట్రాక్టర్ వికారాదా సంవత్సరానికో రెండు

పైర్లు పంట మీదున్నప్పుడు ఉప్పెనల కాంట్రాక్టులు తీసు
కోరాదా జీవితాంతం పదవిని ఒంటిని బట్టగా చుట్టుకోరాదా
కన్నీరు కార్చని జెండాలా గాలిని సవాలు చేస్తూ ఆకాశాన్ని
రెపరెపల్తో సీ అలల్తో పరిహసించరాదా నువ్వూ ఓ ప్లాస్టిక్
చెట్టువై నీ ప్లాస్టిక్ కొమ్మలపై ప్లాస్టిక్ పక్షులు ప్లాస్టిక్ కంకుల
ప్లాస్టిక్ బంగారాన్ని కొరుక్కు తింటూండ నివ్వరాదా నా
ప్లాస్టిక్ వక్షోజాల ప్లాస్టిక్ పాలు తాగరాదా నువ్వు?/ లేదు
నా ప్రియతమా నేను తిరిగి తిరిగి తిరిగి హాయలు హాయ
లుగా పొగలు పొగలుగా సెగలు సెగలుగా కెరట కెరట
కెరటాలుగా తిరిగి వొచ్చే తుఫానుని, ఈ శవాల్ని
యీ సమస్త జంతుజాలం కళేబరాల్ని నా లోనే
ఖననం చేస్తాను కొయ్యగుర్రాన్ని తగల
బెట్టగల కొత్తఇంధనాన్ని కనిపెడతాను
వినాశాయచ దుష్కృతామ్మని!/
సరేరా ఒరే నా ప్రియా
కొత్త కలల్తో కొత్త విశ్వా
సాల్తో నా విశ్వాన్ని నేను
దిగంబరం చేసుకొంటాను

LC No. 2వేలు

1311980 కుందుర్తి మోహన ప్రసాద్

BCR

PJSA168 B160

నికితా గుర్రి
ప్రొ. చేకూరి రామ
వేగుంట మోహనప్రసాద్

విశ్లేషణతో

BC

సృష్టి ప్రచురణ

నగ్నముని

కవిత

కొయ్యగుర్రం

మనసు ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

పుస్తకం సంఖ్య	PJSA11[illegible] B160
పుస్తకం పేరు	నన్ను మళ్ళీ కొంచెం నువ్వుగా చేయ్
తారీఖు	29 March 2025
ముందు అట్ట	Yes
వెనుక అట్ట	Yes
మొత్తం పేజీలు	67
పెద్ద సైజు పేజీలు	no
ఖాళీ పేజీలు	C1, 24, BC1
లేవి పేజీలు	no
తయారు చేసినది	mary Jayasree Sharmila
పేజీలు విడదీసినది	
స్కాన్ చేసినది	
పరీక్ష చేసినది	THASIN
పేజీలు సరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
పరిస్థితి	Good